సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 12.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 005
పేజీలు: 08 వెల: రూ. 5

సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రదాడి

బైక్‌పై వచ్చి కాల్పులు జరిపి పరార్

ఇద్దరు జవాన్లకు గాయాలు | ఆ ఏరియాను జల్లెడ పడుతున్న బలగాలు



రేవంత్ రెడ్డి పల్లెబాట

సంక్రాంతి తర్వాత ప్రతి పల్లెకు సీఎం

రేవంత్ కొత్త స్కెచ్! పల్లెబాటతో ప్రజలకు చేరువ!



ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త రాజకీయ, పరిపాలనా వ్యూహానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతున్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పల్లెను సందర్శించేలా 'ప్రజాబలం' పేరుతో భారీ ప్రజా సంబంధాల కార్యక్రమాన్ని చేపట్టాలని యోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవైపు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ ప్రభుత్వ పాలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం.. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులపై అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధం కావడం ద్వారా రెండు దిశల్లో రాజకీయంగా ముందుకు వెళ్లాలన్నది ఈ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

పల్లెపల్లెకూ సీఎం.. ప్రజలతో నేరుగా మమేకం!
ఇప్పటివరకు సచివాలయం, అధికారిక సమీక్షలు, అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితమవకుండా నేరుగా గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు సమాచారం. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించనున్నారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో నీటి వనరులపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత, సాగునీటి అవసరాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వానికి, గ్రామీణ ప్రజలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడంతోపాటు సంక్షేమ పథకాల అమలుపై క్షేత్రస్థాయి అభిప్రాయాలను సేకరించాలన్నది ఈ కార్యక్రమంలో మరో కీలక అంశంగా కనిపిస్తోంది.

కేసీఆర్ కాళేశ్వరంపై అసెంబ్లీలో సమరం!
మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కీలక చర్చకు వచ్చే అవకాశముంది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, డిజైన్ లోపాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రాజెక్టు నిర్వహణ అంశాలను అసెంబ్లీ వేదికగా చర్చకు తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల అంశం కూడా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును తన హయాంలో సాధించిన ప్రధాన విజయంగా ప్రచారం చేసుకుంది. అయితే బ్యారేజీలకు సంబంధించిన సమస్యలు, నిర్మాణ నాణ్యత, ప్రాజెక్టు వ్యయంపై కాంగ్రెస్ ప్రభుత్వం లేవనెత్తుతున్న ప్రశ్నలకు అసెంబ్లీ వేదికగా సమాధానాలు, ఆధారాలు ప్రజల ముందుంచాలన్నది అధికార పక్షం ఆలోచనగా కనిపిస్తోంది. కాళేశ్వరం అంశాన్ని కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా, సాంకేతిక నివేదికలు, విచారణ వివరాలు, ఆర్థిక అంశాలతో చర్చకు తీసుకురావడం ద్వారా బీఆర్ఎస్ వాదనలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ భావిస్తోంది.

కేడర్‌లో జోష్.. స్థానిక ఎన్నికలే టార్గెట్?
'ప్రజాబలం' పల్లెబాటకు మరో రాజకీయ కోణం కూడా ఉంది. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తల్లో ఉత్సాహం నింపడం, స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేయడం ఈ పర్యటనలో భాగంగా ఉండవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలు, భవిష్యత్ రాజకీయ సవాళ్లను దృష్టిలో పెట్టుకుని పార్టీ యంత్రాంగాన్ని గ్రామ యి నుంచి సిద్ధం చేయాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఉంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి గ్రామాల్లో పర్యటిస్తే ప్రభుత్వ కార్యక్రమాలకు రాజకీయ ప్రాధాన్యత పెరగడంతోపాటు క్షేత్రస్థాయిలో మిగతా 02లో

- అసెంబ్లీలో కాళేశ్వరం అస్త్రం..
- పల్లెల్లో ప్రజాబలం మంత్రం! కేసీఆర్‌కు కాళేశ్వరం సెగ..
- రేవంత్‌కు పల్లెబాట బలం!
- గులాబీ గూటికి గుబులు పుట్టించేలా రేవంత్ ప్లాన్!
- సచివాలయం నుంచి పల్లె బాటకు పయనం
- సంక్రాంతి తర్వాత తెలంగాణలో రేవంత్ రాజకీయ రూట్ మ్యాప్!
- కాంగ్రెస్ కేడర్‌లో కొత్త జోష్!

వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు

బ్లూకాలర్‌కు ఢోకా లేదు



- విద్య, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్న రేవంత్
- ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వెల్లడి
- విద్య, నీటిపారుదలకు నెహ్రూ బలమైన పునాదులు వేశారు
- జాతీయ విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో సీఎంరేవంత్

త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



- హైదరాబాద్ తర్వాత జిల్లాల జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- జర్నలిస్టుల ఆరోగ్య పథకంపైనా ప్రభుత్వం సానుకూలం

2



విజయసాయి పరివర్తన రాజనీతి పార్టీ

చెప్పుడు మాటలు విని జగన్ నన్ను చాలా ఇబ్బంది పెట్టారు

- వైసీపీలో 70కి పైగా అవమానాలను భరించానని ఆవేదన
- ఆ పార్టీ నుంచి తనను గెంటేశారని వెల్లడి
- అన్ని జిల్లాల నుంచి కీలక వ్యక్తులు తమ పార్టీలో చేరుతున్నారు
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతా
- ఏపీ రాజకీయాల్లోకి దూసుకొచ్చిన విజయసాయిరెడ్డి

2

విద్యా వ్యవస్థలో మార్పులు

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం అమలు



- తెలంగాణ విద్యా రంగంలో కీలక సంస్కరణలు
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కొత్త విధానం
- ప్రభుత్వ బడులకు మహర్దశ..
- 12వ తరగతి నుంచే స్కిల్లింగ్‌కు శ్రీకారం
- 9 నుంచి 12వ తరగతి వరకు ప్రత్యేక విద్యా ప్రణాళిక
- మారనున్న ముఖచిత్రం

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ విద్యా రంగంలో కీలక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో 10+2 విద్యా విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యను బలోపేతం చేయడంతో పాటు, విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు అందించేలా కొత్త విద్యా ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

9 నుంచి 12వ తరగతి వరకు
రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. ముఖ్యంగా 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత పాఠశాల విద్యగా పరిగణించి, విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక విద్యా ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు మిగతా 02లో

ముద్రా పథకానికి కొత్త ఊపిరి!

రబీ సీజన్‌కు రూ.62,370 కోట్ల ఎరువుల సబ్సిడీ



- రైతులకు కేంద్రం భారీ తీపికబురు.. ఎరువుల ధరలకు కళ్లెం!
- ముద్రా రుణాలకు రూ.5 వేల కోట్ల క్రెడిట్ గ్యారెంటీ
- లూవ్రేను మించిన మ్యూజియం.. రూ.3,230 కోట్లు కేటాయింపు
- రైతులు, చిన్న వ్యాపారులకు కేంద్ర క్యాబినెట్ భారీ ఊరట

బీఆర్ఎస్ పోరుబాట

నిర్మల్ ఎన్టీఆర్ స్టేడియంలో రైతు గర్జన సభ


కేసీఆర్ హయాంలో వ్యవసాయం సస్యశ్యామలం



- సాగు, తాగునీటికి డోకాలేని పరిస్థితులు
- పరిపాలనలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యం
- రేవంత్ పాలనా వైఫల్యాలపై ప్రధాన ఫోకస్
- మూడు సెగ్మెంట్ల నుంచి భారీగా జన సమీకరణ
- నిర్మల్ నుంచి ఉద్యమం షురూ

ముద్ర, నిర్మల్ :
తెలంగాణలో కరువు పరిస్థితులు, సాగునీటి కొరత, ఎండిపోతున్న పంటల అంశాలను కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్ మరోసారి ఉద్యమ బాట పట్టింది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయంగా ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా రైతు గర్జన సభలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వేదికగా భారీ రైతు గర్జన సభ నిర్వహించేందుకు సిద్ధమైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో సాగుతున్న ఈ రైతు గర్జన కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, సాగునీటి సరఫరా, తాగునీటి సమస్యలు, రైతుల కష్టాలు ప్రధాన చర్చనీయాంశాలుగా మారనున్నాయి. రాష్ట్రంలో కరువు మిగతా 02లో

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం, 12 నవంబర్, 2026

సోంపు : బరువు తగ్గేందుకు సహాయకారి!

సోంపు నీరు తాగడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలిని నియంత్రించడంలో, బరువు తగ్గించే ప్రయత్నాలకు తోడ్పడుతుంది.



రేవంత్ రెడ్డి పల్లెబాట

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పరిస్థితిని అంచనా వేసే అవకాశం ఉంటుంది. మరోవైపు కేటీఆర్, హరీశ్ రావు వంటి బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు ప్రజాక్షేత్రంలోనే సమాధానం చెప్పేందుకు ఈ పర్యటనలు వేదిక కావచ్చు.

రెండు వేదికలు.. రెండు వ్యూహాలు!

మొత్తంగా రేవంత్ రెడ్డి ముందున్న రాజకీయ వ్యూహంలో అసెంబ్లీ, గ్రామీణ ప్రజాక్షేత్రం రెండు కీలక వేదికలుగా కనిపిస్తున్నాయి. అసెంబ్లీలో కాళేశ్వరం, మేడిగడ్డ అంశాలపై చర్చ ద్వారా గత ప్రభుత్వ పాలనను ప్రశ్నించడం.. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రస్తుత ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించడం ఈ రెండు కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలుగా ఉండనున్నాయి. సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్నట్లు ప్రచారం జరుగుతున్న 'ప్రజాబలం' పల్లెబాటకు సంబంధించి అధికారిక షెడ్యూల్, పర్యటనల వివరాలు వెల్లడికావాల్సి ఉంది. అయితే ఈ కార్యక్రమం కార్యరూపం దాలిస్తే తెలంగాణలో ప్రభుత్వ పాలన, అధికార–ప్రతిపక్షాల రాజకీయ పోరాటం రెండింటిపైనా దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. అసెంబ్లీలో కాళేశ్వరం చర్చ.. పల్లెల్లో ప్రజాబలం పర్యటన.. సంక్రాంతి తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కొత్త అంకానికి తెరలేవనుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

విద్యా వ్యవస్థలో మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన పునాదులు ఈ దశలోనే బలంగా వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కేవలం పుస్తక పరిజ్ఞానానికే విద్యను పరిమితం చేయకుండా, విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే నైపుణ్యాలను కూడా అందించాలని సీఎం సూచించారు. 12వ తరగతి నుంచే స్కిల్లింగ్ కార్యక్రమాలను ప్రారంభించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. తద్వారా విద్య పూర్తయ్యే సమయానికే విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పొందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

ప్రైవేట్ కు ధీటుగా..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, బోధనా సదుపాయాలు, ఇతర అవసరమైన సౌకర్యాలను మెరుగుపరిచి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

నష్టం జరగకుండా సంస్కరణలు

విద్యా విధానంలో తీసుకొచ్చే మార్పుల అమలు విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. సంస్కరణల కారణంగా ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మొత్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 10+2 విధానం అమలుతో తెలంగాణ విద్యా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. అయితే ఈ విధానం అమలుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, కార్యాచరణను ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది.

బీఆర్ఎస్ పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులు నెలకొనడానికి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శిస్తోంది. మరోవైపు కేసీఆర్ హయాంలో వ్యవసాయ రంగంలో జరిగిన అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, రైతుబీమా వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తుచేసే ప్రయత్నం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో సాగునీరు, వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చామని చెబుతూ ప్రస్తుత పరిస్థితులతో పోల్చి ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ వ్యూహ రచన చేసింది.



ఇప్పటికే ఆదిలాబాద్‌లో నిర్వహించిన రైతు గర్జన సభతో ఉత్సాహంగా ఉన్న గులాబీ శ్రేణులు.. ఇప్పుడు నిర్మల్‌లో మరో భారీ సభకు సమాయత్తమవుతున్నాయి. మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టాలని పార్టీ నాయకత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సభకు భారీగా రైతులు, పార్టీ కార్యకర్తలను తరలించి బలప్రదర్శన చేయాలని భావిస్తోంది.

ఈ సభలో ప్రధానంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా తీరుపై విమర్శలు, సాగునీటి కొరతకు సంబంధించిన అంశాలు, ఎండిపోతున్న పంటలు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపడం కూడా ఈ సభ వెనుక ఉన్న లక్ష్యంగా కనిపిస్తోంది. మొత్తానికి నిర్మల్ రైతు గర్జన సభతో సాగునీరు, కరువు, రైతుల సమస్యలను ప్రధాన రాజకీయ అజెండాగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. ప్రభుత్వంపై విమర్శలు, గత పాలనలో చేపట్టిన కార్యక్రమాల ప్రస్తావనతో సాగే ఈ సభ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి చర్చకు దారితీస్తుందో చూడాలి.

సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రదాడి

ముద్ర, న్యూఢిల్లీ :

జమ్మూకాశ్మీర్‌లో మరోసారి ఉగ్రదాడి జరిగింది. ఏకంగా కుల్గాం జిల్లాలోని సీఆర్పీఎఫ్ క్యాంపు మీద ఉగ్రవాదులు కాల్పులు జరపడం కలకలం రేపుతోంది. బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు బైకు మీద వచ్చిన గుర్తుతెలియని దుండగులు సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఈ ఉగ్రదాడిలో ఇద్దరు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడినట్లు సమాచారం. గాయపడిన వారిని అనంత్ నాగ్ జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని సీఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు. ఉగ్రదాడి జరిగిన వెంటనే అప్రమత్తమైన సీఆర్పీఎఫ్ సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. బలగాలు ఎదురుకాల్పులు ప్రారంభించగానే ఉగ్రవాదులు తోకముడిచారు. సీఆర్పీఎఫ్ జవాన్లు కాల్పుల నుంచి తప్పించుకునేందుకు వెంటనే బైకు మీద పరారయ్యారని సమాచారం. దాడి జరిగిన వెంటనే జవాన్లు సీఆర్పీఎఫ్ క్యాంప్ సహా చుట్టుపక్కల ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. కాల్పులు జరిపి తప్పించుకున్న ఉగ్రవాదుల కోసం సీఆర్పీఎఫ్ జవాన్లు, భద్రతా బలగాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఆ చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పడుతున్నాయి.

ఎత్తిపోతల పునరుద్ధరణకు
రూ.632 కోట్లు
ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు

ముద్ర,అమరావతి :

గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చునివివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట్టాలని, ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణను పటిష్టం చేయాలని తెలిపారు.



ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్

సమీక్షలో భాగంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా చర్చించారు. జలవనరుల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4,171 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. కేవలం భూములే కాకుండా కాలువలపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలన్నారు.

789 పథకాలకు మరమ్మతులు

ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు

జలహారతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పథకాల పర్యవేక్షణ

ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక

36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

విద్యుత్ రంగానికి ఉన్నట్లుగానే జలవనరుల శాఖకు కూడా 'వాటర్ రెగ్యులేటరీ కమిషన్' ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల తరహాలోనే సాగునీటి రంగంలోనూ ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం వంటి వివిధ రంగాలకు నీటి కేటాయింపులపై కమిషన్ నిర్ణయాలు తీసుకునేలా తీర్చిదిద్దవచ్చన్నారు.

ప్రాజెక్టులకు నిధుల కొరత లేదు

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని సీఎం లక్ష్యం నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వబోమన్నారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ముద్రాకు కొత్త ఊపిరి!

ముద్ర, న్యూఢిల్లీ :

రైతు శ్రేయస్సే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం మరో బృహత్తర నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. రాబోయే రబీ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి కొరత లేకుండా సరసమైన ధరలకే ఎరువులు అందించేందుకు వీలుగా ఏకంగా రూ.62,370 కోట్ల భారీ సబ్సిడీకి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో వ్యవసాయ రంగానికే కాకుండా, చిన్న పరిశ్రమల ప్రోత్సాహానికి, దేశ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

అక్టోబర్ నుంచి మార్చి వరకు సాగే రబీ కాలంలో గోధుమ, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలను రైతులు విస్తారంగా సాగు చేస్తారు. ఈ సమయంలో రైతులకు ప్రాథమిక ఎరువులైన భాస్వరం, పొటాష్ ఎరువులు భారం కాకుండా చూసేందుకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ (ఎన్‌బీఎస్) విధానం కింద ఈ రూ.62,370 కోట్లను కేటాయించారు.

అంతర్జాతీయంగా ఎరువుల ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ, ఆ భారం రైతులపై పడకుండా నేరుగా తయారీదారులు, దిగుమతిదారులకు ప్రభుత్వం ఈ నిధులను అందిస్తుంది. గత రబీ సీజన్‌లో కేటాయించిన రూ. 37,952 కోట్లు, ఖరీఫ్ సీజన్‌లోని రూ.41,534 కోట్లతో పోలిస్తే ఈసారి ప్రభుత్వం నిధులను గణనీయంగా పెంచడం విశేషం.

చిన్న వ్యాపారులు, సూక్ష్మ పరిశ్రమలు స్థాపించే వారికి ఎలాంటి షూరిటీలు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు అందించే 'ప్రధాన్ మంత్రి ముద్రా యోజన'కు క్యాబినెట్ మరింత ఊపిరి ఊదింది. ముద్రా రుణాల క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కోసం రూ.5,000 కోట్లను ఆమోదించింది.



బ్యాంకులు , ఇతర ఆర్థిక సంస్థలు చిన్న వ్యాపారులకు రుణాలు ఇచ్చే సమయంలో ఎదురయ్యే డిఫాల్ట్ నష్టాల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. దీనివల్ల ఎలాంటి పూచీకత్తు లేకపోయినా బ్యాంకులు చిన్న వ్యాపారులకు మరింత ధైర్యంగా రుణాలు మంజూరు చేయడానికి మార్గం సుగమమైంది.

ఢిల్లీలోని చారిత్రాత్మక నార్త్, సౌత్ బ్లాక్ భవనాలను ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'యుగే యుగీన్ భారత్ మ్యూజియం'గా మార్చేందుకు క్యాబినెట్ కమిటీ రూ.3,230 కోట్లను ఆమోదించింది. ఈ మ్యూజియం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రముఖ 'లూవ్రే మ్యూజియం' కంటే ఎంతో పెద్దదిగా ఉండబోతోందని మంత్రి వెల్లడించారు.దాదాపు 1.79 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ మ్యూజియం రోజుకు 30 వేల మంది సందర్శకులకు సరిపోయేలా డిజైన్ చేస్తున్నారు. భారతదేశ శతాబ్దాల నాటి సంస్కృతి, నాగరికతను చాటిచెప్పేలా 18 లక్షల అరుదైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శించనున్నారు. 2027 నుంచి 2031 మధ్య దశలవారీగా ఈ మ్యూజియం అందుబాటులోకి రానుంది.

త్వరలోనే జర్నలిస్టులకు
ఇళ్ల స్థలాలు

ముద్ర, హైదరాబాద్ :

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. బుధవారం నాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రిని కలిసి, ఇటీవల జరిగిన తమ సంఘ రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చేసిన సానుకూల ప్రకటనపై తమ సంఘ కార్యవర్గ సమావేశం కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ ప్రక్రియను వేగవంతం చేసి జర్నలిస్టుల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు విరాహత్ అలీ, రాంనారాయణ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మరో ప్రధాన సమస్య అయిన ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, జర్నలిస్టుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రతా కల్పించాలని తమ సంఘం చేసిన తీర్మానాన్ని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై మంత్రి స్పందిస్తూ ముందుగా హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు చేపడతామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్‌లు ఉన్నారు.

వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక వసతులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



దేశంలో విద్య, నీటిపారుదల రంగాల అభివృద్ధికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బలమైన పునాదులు వేశారని సీఎం పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, యూనివర్సిటీలు, ఐఐటీల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు.

సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని, బ్లూకాలర్ ఉద్యోగాలకు మాత్రం ఆ ప్రమాదం లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలో బీజేపీ రాజకీయాలు చేస్తోందన్నారు.

మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూసీ అభివృద్ధి పూర్తయితే పాతబస్తీకి పర్యాటకుల రాక పెరుగుతుందని, నగరంలో నైట్ ఎకానమీకి ఊతం లభిస్తుందని చెప్పారు. ఎస్ఐఆర్ పేరుతో పేదలు, మైనార్టీలు, ఎస్టీల ఓట్లు తొలగిస్తున్నారని బీజేపీపై ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మోదీని ఓడించడమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.



విజయసాయి
పరివర్తన రాజనీతి పార్టీ

ముద్ర, అమరావతి:

వైసీపీలో తాను తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నానని మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ) అధినేత విజయసాయిరెడ్డి అన్నారు. విజయవాడలో తన పార్టీని ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వైసీపీని స్వచ్ఛందంగా వీడలేదని, తనను అవమానించి బలవంతంగా పార్టీ నుంచి బయటకు పంపించారని ఆయన స్పష్టం చేశారు. వైసీపీలో ఉన్న సమయంలో తాను 70కి పైగా అవమానాలను భరించానని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మనిషి తట్టుకోలేని రీతిలో అక్కడ అవమానాలు జరిగాయని, ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఎవరూ ఉండలేరని వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత జగన్ కొందరి చెప్పుడు మాటలు విని తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. పార్టీ కోసం ఎంతగానో శ్రమించిన తనను చివరకు అవమానకర రీతిలో బయటకు నెట్టారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే సరికొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టినట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కీలక వ్యక్తులు, నాయకులు తమ కొత్త పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12.11.2026
www.mudranews.in | @mudranews

సోంపు : చర్మానికి సహజమైన మెరుపు!

సోంపులోని యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి.



నీళ్ల నివాసాన్ని ఆక్రమిస్తే మన నివాసాలనే ఆక్రమిస్తాయి..

- చెరువుల ఆక్రమణతోనే నగరంలో వరదలు..
- మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతాం
- తమ్మిడికుంటను 'లేక్ ఎకానమీ'గా అభివృద్ధి చేస్తాం
- 1,370 చెరువుల్లో సగం మాయం.. అందుకే వరద ముప్పు
- చెరువుల పునరుద్ధరణకు ప్రజలు, యువత సహకరించాలి
- సీఎం రేవంత్ రెడ్డి





ముద్ర, హైదరాబాద్: నీళ్ల నివాసాన్ని మనం ఆక్రమిస్తే, ఆ నీళ్లే మన నివాసాలను ఆక్రమిస్తాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. నిజాం కాలంలోనే మూసీ పరివాహక ప్రాంతాల ప్రాధాన్యతను గుర్తించారని, అయితే కాలక్రమేణా అది కబ్జాల బారిన పడి నల్గొండ ప్రజలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మూసీ ప్రక్షాళన చేపట్టి విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని, ఈ క్రమంలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు.

తమ్మిడికుంట చెరువు అభివృద్ధికి సినీ నటుడు నాగార్జున ముందుకు రావడం అభినందనీయమని, ఆయన నిజమైన హైదరాబాదీ అని కొనియాడారు. 1,370 చెరువులలో సగం మాయమవ్వడం వల్లే చిన్న వర్షానికి నగరంలో వరదలు వస్తున్నాయని వివరించారు. తమ్మిడికుంటను 'లేక్ ఎకానమీ'గా మార్చి, స్వయం శక్తి సంఘాలకు స్టాల్స్ కేటాయించాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ సదుపాయాలు కల్పించి, అక్కడ జమ్మి చెట్టు నాటాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా సినీ నటుడు అక్కినేని నాగార్జున మాట్లాడుతూ.. తమ్మిడికుంట చెరువును ఎంతో అందంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. నీళ్లు, చెరువుల సంరక్షణపై సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న ఆసక్తిని కొనియాడుతూ, 2 వేల చెరువులను ఇలాగే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. మనం మన పిల్లలకు ఇచ్చే అతిపెద్ద ఆస్తి మంచి ప్రకృతేనని చెప్పారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధితో ఈ ప్రాంత స్వరూపమే మారిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రారంభంలో వ్యతిరేకత వచ్చినా, ఇప్పుడు 80 శాతం మంది అనుకూలంగా మాట్లాడుతున్నారని తెలిపారు. తాను కూడా 10 చెరువులను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ. ఒకప్పుడు భయపడే పరిస్థితి ఉన్న తమ్మిడికుంటను 15 ఎకరాల నుంచి 30 ఎకరాలకు విస్తరించి అభివృద్ధి చేశామన్నారు. నాళాల ద్వారా నీరు చేరేలా చర్యలు తీసుకున్నామని, వరదల నివారణకు చెరువుల పునరుద్ధరణ అత్యంత కీలకమని, హైడ్రాకు యువత మద్దతు లభిస్తోందని చెప్పారు.

ప్రపంచ సమస్యలకు పరిష్కారాలే లక్ష్యం

భారత్ సమ్మిట్ రాజకీయ వేదిక కాదు.. : మంత్రి శ్రీధర్ బాబు



ముద్ర, హైదరాబాద్ : భారత్ సమ్మిట్ నిర్వహణపై బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఖండించారు. రాహుల్ గాంధీని రీలాంచ్ చేయడానికే సమ్మిట్ నిర్వహిస్తున్నారంటూ కొందరు బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న నాయకుడని, ఆయనను ప్రత్యేకంగా మరోసారి లాంచ్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. హైదరాబాద్ లోని హెచ్ ఐసీసీలో భారత్ సమ్మిట్ పై నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్ బాబు మాట్లాడారు. ప్రగతిశీల ఆలోచనలు కలిగిన పార్టీ కాంగ్రెస్ అని, ఆ భావజాలంతోనే తమ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. బీజేపీ ఆలోచనా విధానం భిన్నంగా ఉంటుందని, ఆ పార్టీ భావజాలం ఏమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. మోదీ తర్వాత ఎవరిని లాంచ్ చేయాలని బీజేపీ ఆలోచిస్తోందంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఆలోచనా విధానం బీజేపీకి ఎప్పటికీ అర్థం కాదని వ్యాఖ్యానించారు. భారత్ సమ్మిట్ ను రాజకీయ కోణంలో చూడకూడదని, ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ ఆర్థిక సదస్సు తరహాలో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యువత, సాంకేతికత సహా అనేక కీలక అంశాలపై సదస్సులో చర్చలు జరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా జెన్ జీ యువత లేవనెత్తుతున్న పలు అంశాలపై మేధోపరమైన చర్చలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఎస్ ఐఆర్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల ప్రజాస్వామిక ప్రభావాలపైనా చర్చిస్తామని మంత్రి వెల్లడించారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- దుండ్ర కుమారస్వామి

ముద్ర, హైదరాబాద్: పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి అన్నారు. మెహిదీపట్నం గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ ప్యాలెస్ లో మన్నన్, బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం, జాబ్ మేళా–2026లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అర్హతకు తగిన ఉద్యోగాలు, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత, ప్రైవేటు రంగంలో స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కుమారస్వామిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాడతానని తెలిపారు.

ప్రతి ఇంటా ఉసిరి.. ప్రతి గుడిలో బిల్వం

ముద్ర, హైదరాబాద్ : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ 'ప్రతి ఇంటా ఉసిరి.. ప్రతి గుడిలో బిల్వం' పేరుతో ప్రత్యేక హరిత కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లకు, ఆలయాలకు ఉసిరి, బిల్వ మొక్కలను పంపిణీ చేయనున్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మంగళవారం తన నివాసంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవంబర్ 11 నుంచి మొక్కల పంపిణీ చేపట్టనున్నారు. భక్తి సంప్రదాయాలను పర్యావరణ పరిరక్షణతో మేళవించి ప్రతి ఇంట్లో, ఆలయంలో మొక్కలు నాటి సంరక్షించడమే లక్ష్యమని సంతోష్ కుమార్ తెలిపారు. 2031 అక్టోబర్ 15 నాటికి వంద కోట్ల మొక్కలు నాటాలనే లక్ష్యంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమాలు కొనసాగిస్తోంది.

ప్రపంచ విధాన చర్చలకు హైదరాబాద్ వేదిక

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా భారత్ సమ్మిట్–2
70కిపైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రతినిధుల హాజరు



ముద్ర, హైదరాబాద్ : ప్రపంచ ఆర్థిక, రాజకీయ, సామాజిక విధానాలపై చర్చలకు హైదరాబాద్ ను అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లక్ష్యంగా నవంబర్ 13, 14 తేదీల్లో హైదరాబాద్ లో భారత్ సమ్మిట్–2 నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 70కిపైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన నిర్ణేతలు, మేధావులు ఈ సదస్సులో పాల్గొననున్నట్లు చెప్పారు. హైటెక్స్ లోని నోవాటెల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అహింసా సిద్ధాంతం, నెహ్రూ అనుసరించిన అలీన విదేశాంగ విధానం, మిశ్రమ ఆర్థిక విధానాలు నేటి ప్రపంచానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు అగ్రరాజ్యాల ప్రభావానికి లోనుకాకుండా తమ స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాలు రెండు కీలక స్తంభాలని భట్టి అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అలాగే, ఎస్ ఐఆర్ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం బాధ్యత కావాలని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ, అహింస, అలీన విధానం, ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ ఆత్మకథ ఆధారంగా సినిమా తీస్తా

- జగ్గారెడ్డి



ముద్ర, సంగారెడ్డి: కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాసిన పుస్తకం ఆధారంగా సినిమా తీస్తానని తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ''సోనియా గాంధీ ఆత్మకథ (బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్)ను తెలుగు భాషలో సినిమాగా తీస్తాం. పార్టీ నాయకులు డబ్బులు రెడీ చేసుకోవాలి. ప్రజలకు సోనియా జీవిత చరిత్రని సినిమా ద్వారా చూపించాలి. ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్ గాంధీ భార్యగా, రాహుల్, ప్రియాంకలకు తల్లిగా ఆమె జీవితాన్ని సినిమాలో చూపిస్తా. ఆమెది విజయవంతమైన రాజకీయ జీవితం. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా సినిమా షూటింగ్ ప్రారంభిస్తా. ఈ సినిమాకి సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే ప్రొడ్యూసర్లు. సినిమా కోసం ఓ కమిటీ వేసి.. ప్రక్రియ ప్రారంభిస్తా. దేశంలో సోనియాగాంధీకి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. సముద్రం ఎంత లోతో.. అంతటి రాజకీయ వ్యవస్థతో కూడింది కాంగ్రెస్ పార్టీ. సోనియాగాంధీకి ప్రధాని కుర్చీపై వ్యామోహం లేదు. భర్త చనిపోయాక ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా.. పీవీని ప్రధాని చేశారు. యూపీఏ ప్రభుత్వం వచ్చాక సోనియాని ప్రధానిగా ఉండాలని అందరూ కోరినా.. ఆమె మాత్రం మన్మోహన్ సింగ్‌ని ప్రధానిగా చేశారు. ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా వదులుకున్నారు.. అది ఓ చరిత్ర. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనేది సోనియా కోరిక'' అని జగ్గారెడ్డి తెలిపారు.

తెలంగాణలో భారీ పెట్టుబడులకు ముందుకు రావాలి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026లో భాగస్వాములు కావాలి
విజన్ 2047 లక్ష్య సాధనలో ఆటోమొబైల్, ఈవీ రంగాలు కీలకం
పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణకు ప్రభుత్వం పూర్తి సహకారం: మంత్రి పొన్నం ప్రభాకర్



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో ఆటోమొబైల్, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో భారీ పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పాటు, 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026లో భాగంగా సచివాలయంలో ఆటోమొబైల్, ఈవీ రంగాల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోమొబైల్ తయారీ, బ్యాటరీ టెక్నాలజీ, ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోనే ప్రత్యేకమైన ఈవీ పాలసీని అమలు చేస్తూ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లపై 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపులు కల్పించామని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలతో గత రెండేళ్లలో రాష్ట్రంలో 2,17,690 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయని, రూ.2,343 కోట్ల పన్ను మినహాయింపులు ఇచ్చామని వెల్లడించారు. జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌తో పాటు ఎంకతల, కొడంగల్ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయని చెప్పారు. పెట్టుబడిదారులకు భూమి, అనుమతులు, మౌలిక సదుపాయాలు, విధానపరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే హ్యుందాయ్, మహీంద్రా, అమర రాజా, ఒలెక్ట్రా, బాష్ తదితర సంస్థలు రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి సహకరిస్తామని తెలిపారు. సుమారు 25 మంది పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో రవాణా శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి నిఖిల్ చక్రవర్తి, జేటీసీ వెంకట రమణ, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కన్వీనర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అవ్‌సద్ షేక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

దేశంలోనే తొలి ఏఐ పోలీసు స్టేషన్‌గా పంజాగుట్ట



ముద్ర, హైదరాబాద్: దేశంలోనే తొలి ఏఐ పోలీసు స్టేషన్‌గా పంజాగుట్ట మారనుందని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. పంజాగుట్ట పీఎస్‌ను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా ఏఐ ఠాణా ప్రారంభమవుతుందని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా ఈ సరికొత్త విధానం తెస్తున్నట్లు చెప్పారు. రిసెప్షన్‌లో సేతు కియోస్క్ ఏర్పాటు, 10 భాషల్లో ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని వివరించారు. ఏఐ ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు, కేసు డైరీ, దర్యాప్తు నివేదికలు, ఛార్జ్‌షీట్ రూపకల్పన ఉంటాయన్నారు. పోలీసు సిబ్బందికి దీనిపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో GHMCకి జాతీయ అవార్డు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్
పారిశుద్ధ్య నిర్వహణలో హైదరాబాద్‌కు జాతీయ గుర్తింపు



ముద్ర, న్యూఢిల్లీ : స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ అవార్డును అందుకుంది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, GHMC కమిషనర్ ఆర్వీ కర్ణన్, HMDA కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించింది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరి శుభ్రత, ప్రజల భాగస్వామ్యం తదితర పది ప్రధాన అంశాల ఆధారంగా నిర్వహించిన మూల్యాంకనంలో GHMC తన పనితీరును ప్రదర్శించింది.

స్వచ్ఛతలో హైదరాబాద్ ప్రస్థానం

2017లో హైదరాబాద్ ఓడీఎఫ్ హోదా సాధించగా, 2019లో ఓడీఎఫ్++ గుర్తింపు పొందింది. 2021లో తెలంగాణలోనే తొలిసారిగా వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ పొందిన స్థానిక సంస్థగా GHMC నిలిచింది. 2023, 2024లోనూ ఈ హోదాను కొనసాగించింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో ఆరో ర్యాంకు సాధించింది. అలాగే 2023లో 5 స్టార్, 2024లో 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపులు పొందింది.

10,500 మార్కులతో మూల్యాంకనం

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26లో మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. కనిపించే పారిశుద్ధ్యం, చెత్త వేరు చేయడం, సేకరణ, రవాణా, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య సదుపాయాలు, వినియోగించిన నీటి నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, పౌరుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు GHMC మెంటార్


స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా GHMC మెంటార్ సిటీగా వ్యవహరిస్తూ మంథని, చేర్యాల మున్సిపాలిటీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది. ఆయా పట్టణాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు వర్క్‌షాప్‌లు నిర్వహించింది. 2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్ జంట నగరాల్లో మూడో పక్షం ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పారిశుద్ధ్య మౌలిక సదుపాయాలు, చెత్త నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ఇంటింటి చెత్త సేకరణతో పాటు ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. GHMCకి జాతీయ అవార్డు లభించడం నగర ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. ఈ గుర్తింపు హైదరాబాద్‌ను మరింత పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
గురువారం, 12 నవంబర్, 2026
4
వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

రుద్రమదేవికి
గౌరవం ఏదీ?
పదకొండేళ్లుగా ఆవిష్కరణకు నోచుకోని విగ్రహం!



చరిత్ర పుస్తకాల్లో పేజీలు తిప్పితే చాలు.. కళ్ల ముందు కత్తులు మెరుస్తాయి, గుర్రపుడెక్కల చప్పుళ్లు వినిపిస్తాయి, రణరంగంలో శత్రువులను చీల్చిచెండాడిన ఒక వీరనారి సాహసం ఉప్పొంగుతుంది. ఆమే కాకతీయ సామ్రాజ్య చైతన్య జ్యోతి, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక రాణి రుద్రమదేవి. కానీ, అదే చరిత్రను కంటికి రెప్పలా దాచిపెట్టిన నేలపైకి వచ్చి చూస్తే... మన గుండెల్ని పిండేసే ఒక పరాభవం ప్రత్యక్షమవుతుంది! నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గడ్డపై ఆ ధీరవనిత వీరమరణానికి సాక్ష్యంగా నిలిచిన ఆనవాళ్లు ఉన్నాయంటే నమ్మగలమా? ఈ శాసనం 1289 నవంబర్ 27న కాకతీయ వీరవనిత రాయగజకేసరి రాణి రుద్రమదేవి వీరమరణాన్ని ధృవీకరిస్తున్నది. సరిగ్గా అదే నేలపై, ఏడు క్వింటాళ్ల బరువుతో ఆ రాణి కాంస్య విగ్రహం ప్రతిష్ఠించి పదకొండేళ్లు దాటినా.. నేటికీ ఆవిష్కరణ ముసుగు తొలగకపోవడం మన కాలం చేసుకున్న దౌర్భాగ్యం కాదా? చరిత్రను వెలికితీయడం ఎంత గొప్పదో, దానికి తగిన గౌరవం ఇవ్వడం అంతకంటే బాధ్యత. మరి, ఆ బాధ్యతను పాలకులు, అధికారులు ఎలాగు విస్మరించారు.. విగ్రహాన్ని ప్రతిష్ఠించిన యువతకు ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.కాలం గడిచినా నేటికీ ఆవిష్కరణకు నోచుకోలేదు. నేడు రాణి రుద్రమదేవి 737 వర్ధంతి సందర్భంగా ఆ శిలాశాసనానికి సంబంధించిన చారిత్రక విశేషాలు

భూమిలో కూరుకుపోయిన చరిత్ర.

చందుపట్ల గ్రామానికి పశ్చిమాన పెద్ద మ్యాలమ్మ గుడి సమీపంలో రుద్రమదేవి వీరమరణాన్ని తెలిపే శాసనం ఉంది. 1967లో వెలుగులోకి వచ్చిన ఈ శాసనం సగానికి పైగా భూమిలో కూరుకుపోయింది. గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త శ్రీ పెరంబుదూర్ రంగాచార్య, శాసన పరిశోధకుడు డి. సూర్యకుమార్, వివేకానంద యువజన మండలి సభ్యులు దాని వెలికితీతకు కృషి చేశారు. అప్పటి కలెక్టర్ పురుషోత్తం రెడ్డి రూ.80 వేలతో పునరుద్ధరణ పనులు చేయించారు.

పరిశోధనతో చారిత్రక గుర్తింపు

1987లో ప్రముఖ చరిత్రకారుడు పరబ్రహ్మశాస్త్రి విస్తృత పరిశోధన చేసి శాసనం ప్రాధాన్యాన్ని నిర్ధారించారు. 2009 నవంబరు 27న దానిని గద్దెపై ప్రతిష్ఠించారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన మెడిమెకల్ శాసనం కూడా చందుపట్ల శాసనం ప్రామాణికతను బలపరుస్తోందని చరిత్రకారుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ పేర్కొంటున్నారు.

చందుపట్ల శాసనంలో ..

శత్రు రాజ్యాల రాజుల దాడులను తిప్పి కొట్టిన రుద్రమ చివరి ఘట్టం చందుపట్ల గ్రామ ప్రాంతంలో జరిగినట్లు చందుపట్ల శాసనం ద్వారా తెలుస్తుంది. పూర్వికులు రాజ్య పర్యటనలో భాగంగా వరంగల్, పిల్లలమర్రి నుండి ఇనుపాముల గ్రామం మీదుగా చందుపట్ల గ్రామం చేరుకొని శివపూజలు నిర్వహించి పానగల్లు వెళ్లే వారని తెలుస్తుంది. ఈ ప్రాంతంలో వారికి కొంత సైన్యం సూచించిన శాసనం ద్వారా తెలుస్తుంది. చందుపట్లలో బయల్పడిన క్రీస్తు శకం 1289 నవంబర్ 27 నాటి శాసనమిది. రాణి రుద్రమదేవి వీరమరణం పొందినందుకు జ్ఞాపకార్థంగా ఆమె సేనాధిపతి మల్లికార్జున నాయకుడు పువ్వులముమ్మడి ఈ శాసనం వేయించాడు. సోమనాథ దేవునికి కొంత భూమిని దానమిచ్చినట్లు ఈ శాసనం కనిపిస్తుంది. దీన్ని బట్టి ఈ శాసనం వేయించడానికి కొన్ని రోజుల ముందు అంటే క్రీ.శ 1280 నవంబర్ 27న మరణించినట్లు స్పష్టమవుతుంది. అప్పటికి రుద్రమదేవి 80 ఏండ్ల వృద్ధురాలై ఉండాలి. జన్మత సాహసవంతురాలైనందున ఆమె సైనికుల్లో ఉత్సాహం, ప్రేరణ కలిగించడం కోసం మల్లి కార్జునుడి అండతో ఆ వయసులో కూడా సైన్యానికి నాయకత్వం వహించి స్వీ ఉండవచ్చు. త్రిపురాంతకం శాసనాన్ని బట్టి అంబదేవుడితో పోరాడి యుద్ధంలో మల్లికార్జునుడితో సహా మరణించినట్లు తెలుస్తుంది. ఒక వృద్ధురాలిని చంపానని చెప్పుకోవడం తనంతటి యోధుడికి పరువు నష్టం కనుక ఈ పరిశీలన అంబదేవుడు తన శాసనాలలో ఎక్కడా ప్రస్తావించలేదు.

కలెక్టర్ చొరవతో..

రుద్రమదేవి చరిత్రకు గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో వివేకానంద యువజన మండలి సభ్యులు 2012 ఆగస్టులో అప్పటి కలెక్టర్ ముక్తేశ్వరరావు చందుపట్లకు వచ్చిన సందర్భంలో శాసనం ప్రాధాన్యాన్ని వివరించి, గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు కు చొరవ తీసుకున్నారు.

ఎస్బిహెచ్ సహకారంతో కాంస్య విగ్రహం

కలెక్టర్ చొరవతో అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్) ద్వారా విగ్రహ తయారీకి రూ.6.50 లక్షలు సమకూరాయి. పది అడుగుల ఎత్తు, ఏడు క్వింటాళ్ల బరువున్న కాంస్య విగ్రహాన్ని రూపొందించారు. దాతల సహకారంతో గద్దె నిర్మించి చందుపట్ల స్టేజి వద్ద 2015లో విగ్రహాని గద్దెపై ఏర్పాటు చేశారు. అయితే అధికారిక ఆవిష్కరణ మాత్రం జరగలేదు. విగ్రహంపై కప్పిన ముసుగు ప్రకృతి ప్రభావంతో తొలగిపోయిందే తప్ప, లాంఛనంగా ఆవిష్కరించిన దాఖలాలు లేవు.

హామీలు హామీలుగానే!

2015 ఏప్రిల్ 26న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చందుపట్లను సందర్శించారు. గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఏటా కాకతీయ ఉత్సవాలు నిర్వహిస్తామని, ప్రవేశద్వారం వద్ద కాకతీయ శిలాతోరణం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 2022 జులై 12న అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా గ్రామాన్ని సందర్శించి రుద్రమదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. అయినా ఆచరణలో ఆశించిన మార్పు కనిపించడం లేదు.

ఆవిష్కరణకు అడ్డంకులేవి?

అప్పటితెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రముఖులతో విగ్రహాన్ని ఆవిష్కరింపజేయాలనే ప్రయత్నాలు జరిగాయన్న ప్రచారం స్థానికంగా వినిపించాయి. కానీ, కార్యక్రమం ఎందుకు కార్యరూపం దాల్చలేదన్నది ప్రశ్నార్థకంగానే మిగిలింది. కమిటీలో సమన్వయ లోపమా? అంతర్గత విభేదాలు ఉన్నాయా? వ్యక్తిగత నిర్ణయాలు ముందుకు వచ్చాయా? రాజకీయ ఒత్తిడి కారణాలా? అధికారుల నిర్లక్ష్యమా? అన్న సందేహాలకు సమాధానం రావాల్సి ఉంది. పలు అనుమానాలకు తావుతీస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. విగ్రహ పరిసరాల మరమ్మతులు, పచ్చదనం, సుందరీకరణకు ఎస్బీఐ సహకారం అందించిందనే సమాచారం ఉన్నా, పనుల పరిస్థితిపై స్పష్టత లేదు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

శాసనాన్ని సంరక్షించి, దాని చరిత్రను తెలిపే సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి. విగ్రహ పరిసరాలను సుందరీకరించి సందర్శకులకు అవసరమైన వసతులు కల్పించాలి. పాఠ్యాంశాల్లో చోటు దక్కిన చరిత్రకు క్షేత్రస్థాయిలోనూ తగిన గుర్తింపు ఇవ్వాలి.

ఉత్సవాలు అధికారికంగా జరపాలి

చందుపట్లను పర్యాటక కేంద్రంగా గుర్తించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాకతీయ శిలాతోరణం నిర్మించడంతోపాటు, వరంగల్‌లో నిర్వహిస్తున్న తరహాలో ఇక్కడా కాకతీయ ఉత్సవాలు జరపాలని డిమాండ్ చేస్తున్నారు. రుద్రమదేవి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆవిష్కరణకు ముహూర్తమెప్పుడు?

రుద్రమదేవి విగ్రహాన్ని అధికారికంగా ఆవిష్కరించేందుకు యువత చేస్తున్న ప్రయత్నాలకు ప్రభుత్వం అండగా నిలవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువజన మండలి, గ్రామ పెద్దలు సమన్వయంతో ముందుకెళ్లి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. పదకొండేళ్ల నిరీక్షణకు ఇకనైనా తెరపడాలి. రుద్రమదేవి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చదివిస్తూ, ఆమె విగ్రహానికి మాత్రం గౌరవం కల్పించలేకపోవడం మన చారిత్రక స్పృహకే మచ్చ. వీరనారి గౌరవం విషయంలో రాజకీయాలెందుకు? ఆవిష్కరణకు ఇన్ని వాయిదాలెందుకు? ఆమె విగ్రహం పట్ల నిర్లక్ష్యం వీడి . విగ్రహాన్ని ఆవిష్కరించేప్పుడే సముచిత గౌరవం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది .ఈ ప్రశ్నలకు సమాధానం ప్రకటనల్లో కాదు.. ఆచరణలో కనిపించాలి.

గుడగోజు రవీంద్రచారి
జర్నలిస్టు, 9848772232



నేటివ్ టేబుల్

మార్కెట్ లోకి కొత్త బ్రాండ్

విటమిన్ D, B12, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే గుడ్లపై దృష్టి..

త్వరలో 6, 12, 30 గుడ్ల ప్యాక్‌లు అందుబాటులోకి

బ్రౌన్ ఎగ్స్

కుటుంబ ఆరోగ్యమే లక్ష్యం



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ప్రతి కుటుంబానికీ ఒక సవాలుగా మారింది. ముఖ్యంగా పిల్లల నుంచి పెద్దల వరకు రోజువారీ ఆహారంలో తగినంత పోషకాలు ఉండేలా చూసుకోవడం ఎంతో అవసరం. అలాంటి సమయంలో ప్రతి ఇంట్లోనూ సులభంగా అందుబాటులో ఉండే గుడ్డు.. పోషకాహారానికి మంచి ఎంపికగా నిలుస్తోంది. అయితే గుడ్డు అంటే కేవలం ఆకలి తీర్చే ఆహారం మాత్రమే కాదు.. నాణ్యత, తాజాదనం, కోళ్ల పెంపకం విధానం కూడా దాని విలువను నిర్ణయిస్తాయి. ఈ ఆలోచనతోనే విజయవాడకు చెందిన 'నేటివ్ టేబుల్' (Native Table) బ్రౌన్ ఎగ్స్ ప్రత్యేక గుర్తింపు పొందే ప్రయత్నం చేస్తోంది. ఇది పూర్తిగా 'యాంటీ బయాటిక్ ఫ్రీ' ఎగ్‌గా మందులు వాడకుండా సాగవుతున్న కోడిగుడ్లు కావడం విశేషం. డీ3, బీ12 , ఓమెగా 3 లాంటి పోషకాలు గుడ్డులో ఉంటాయి.

కుటుంబం కోసం మొదలైన ఆలోచన.. ప్రతి ఇంటికీ నాణ్యమైన గుడ్లు!

తమ కుటుంబ సభ్యులకు ఎలాంటి గుడ్లను అందించాలనుకుంటామో.. అలాంటి నాణ్యమైన గుడ్లనే ఇతర కుటుంబాలకూ అందించాలనే ఉద్దేశంతో నేటివ్ టేబుల్ ప్రారంభమైంది. కుటుంబ ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, సహజమైన పోషక విలువలు కలిగిన బ్రౌన్ ఎగ్స్‌ను వినియోగదారులకు పరిచయం చేస్తోంది.

విటమిన్ D,

వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విభిన్న ప్యాకేజింగ్ పరిమాణాల్లో బ్రౌన్ ఎగ్స్‌ను అందించేందుకు సంస్థ సిద్ధమవుతోంది. కుటుంబాల అవసరాలకు అనుగుణంగా 6, 12, 30 గుడ్ల

త్వరలో అందుబాటులోకి! 6 నుంచి 30 వరకు..

ప్యాక్‌లతో పాటు పరిచయ ఆఫర్‌గా 30 గుడ్ల ట్రేను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ ప్యాక్‌లన్నీ త్వరలో అందుబాటులోకి రానున్నాయి.



సహజమైన ఆహారం: నాణ్యమైన సహజ పదార్థాలతో కూడిన ఫీడ్‌ను అందించడం.

యాంటీబయాటిక్స్‌కు దూరం: కోళ్ల పెంపకంలో రొటీన్ యాంటీబయాటిక్స్ వినియోగాన్ని నివారించడం.

పోషకాలకు ప్రాధాన్యత: విటమిన్ D, విటమిన్ B12, ప్రోటీన్ వంటి పోషకాలు అందించే గుడ్లను వినియోగదారులకు చేరవేయడం.

ఈ విధానాల ద్వారా కోళ్ల సంక్షేమంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించడమే తమ లక్ష్యమని బ్రాండ్ చెబుతోంది.

ఫామ్ నుంచి ఫ్యామిలీ టేబుల్ వరకు..

ఆహారం విషయంలో నాణ్యతపై అవగాహన పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో వినియోగదారులు కేవలం ధరను మాత్రమే కాకుండా, ఆ ఉత్పత్తి ఎలా తయారైంది? దాని వెనుక ఎలాంటి పెంపకం విధానం ఉంది? వంటి అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. ఈ మారుతున్న వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా నేటివ్ టేబుల్ తన బ్రాండ్‌ను తీర్చిదిద్దుకుంటోంది.

'From Our Family Table to Yours' అనే సందేశంతో.. తమ కుటుంబానికి అందించే ఆహార నాణ్యతనే ఇతర కుటుంబాలకూ అందించాలనే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తోంది. విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ఈ ప్రయత్నం ద్వారా ప్రకృతి సహజత్వానికి దగ్గరగా ఉండే ఆహారాన్ని ప్రతి ఇంటి భోజన పట్టికపైకి తీసుకురావాలనేది సంస్థ ఆశయం.

నేటివ్ టేబుల్ సందేశం ఒక్కటే.. మంచి ఆహారం అనేది ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండాల్సిన ప్రాధాన్యత. మీ కుటుంబ భోజన పట్టికపైకి నాణ్యమైన గుడ్లను తీసుకురావడమే తమ ప్రయత్నమని బ్రాండ్ చెబుతోంది.

'నేటివ్ టేబుల్' పేరుతో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సహజ సిద్ధ కోడిగుడ్లను ఉత్పత్తి చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ కంపెనీ నేటివ్ టేబుల్ మేనేజింగ్ పార్ట్ నర్ ములుపూరి చరిత, మేనేజింగ్ పార్ట్ నర్ జలజ ములుపూరి. వీరి సదాశయంతో ఎంతో మంది ప్రజలు ఆరోగ్యకర జీవితాన్ని పౌష్టికాహారాన్ని అందుకుంటున్నారు.

బ్రౌన్ ఎగ్స్ ఎందుకు ప్రత్యేకం?

బ్రౌన్ ఎగ్స్‌పై ప్రస్తుతం చాలామందిలో ఆసక్తి పెరుగుతోంది. వీటి ఆకర్షణీయమైన గోధుమ రంగు, పచ్చసొన రూపం, రుచి వంటి అంశాలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. అయితే గుడ్డు పెంకు రంగు ఆధారంగా మాత్రమే దాని పోషక విలువలను నిర్ణయించలేము. కోళ్లకు అందించే ఆహారం, పెంపకం విధానం, గుడ్డు తాజాదనం వంటి అంశాలు కూడా పోషక నాణ్యతపై ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో సహజమైన పోషకాహారాన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలనుకునే కుటుంబాలకు నేటివ్ టేబుల్ బ్రౌన్ ఎగ్స్ ఒక ప్రత్యామ్నాయంగా నిలవాలని భావిస్తోంది.



విటమిన్ B12తో పాటు నాణ్యమైన ప్రోటీన్‌కు గుడ్లు మంచి వనరుగా నిలుస్తాయి. ముఖ్యంగా రోజువారీ ఆహారంలో ప్రోటీన్‌ను చేర్చుకోవాలనుకునే వారికి ఇవి ఉపయోగకరమైన ఎంపిక. రుచి, తాజాదనం, పోషక విలువలకు ప్రాధాన్యత ఇచ్చే కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని నేటివ్ టేబుల్ తన ఉత్పత్తులను అందిస్తోంది.

కోళ్ల పెంపకంలోనూ ప్రత్యేక శ్రద్ధ

నాణ్యమైన గుడ్లు అందించాలంటే కోళ్ల పెంపకంలోనూ తగిన జాగ్రత్తలు అవసరం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నేటివ్ టేబుల్ కొన్ని ప్రత్యేక విధానాలను అనుసరిస్తున్నట్లు వెల్లడిస్తోంది.

ఒత్తిడి లేని వాతావరణం: కోళ్లను ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో పెంచడం.





ఎంక్వైరీలు, వివరాల కోసం:

Native Table
Brown Eggs , Vijayawada,
Andhra Pradesh
+91 80964 25678.

కాల్ or వాట్సాప్

బెంగళూరు, హైదరాబాద్, విజయవాడల్లో ఇదే నంబర్ నుంచి ఈ నేచురల్ కోడిగుడ్లను ప్రజలు ఆర్డర్ చేసి పొందవచ్చు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12.11.2026
www.mudranews.in | @mudranews

సోంపు : మలబద్ధకం సమస్యకు ఉపశమనం



సోంపు నీటితో పాటు తగినంత నీరు తాగడం జీర్ణవ్యవస్థ పనితీరుకు తోడ్పడుతుంది. మలబద్ధకం సమస్యను తగ్గించడంలో సహాయపడవచ్చు.

ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

మూడు షిఫ్టుల్లో సుమారు 1,980 మంది స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు
హైదరాబాద్‌కు పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకూ ఐటీ, ఐటీఈఎస్ రంగం విస్తరణ: మంత్రి



ముద్ర, ఆదిలాబాద్, నవంబరు 11: తెలంగాణలో ఐటీ, ఐటీఈఎస్ రంగాన్ని హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన ఐటీ టవర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ జాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి తదితర స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ ఐటీ టవర్ ద్వారా మూడు షిఫ్టుల్లో సుమారు 1,980 మంది స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఐటీ రంగంలోని ఉపాధి అవకాశాలను హైదరాబాద్ దాటి జిల్లాలకు విస్తరించడం ద్వారా స్థానిక యువతకు తమ ప్రాంతాల్లోనే ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.ఆదిలాబాద్‌ను ఐటీ, పారిశ్రామిక రంగాలకు అనువైన కేంద్రంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాల యువతకు చేరేలా ఐటీ మౌలిక సదుపాయాల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.నూతన ఐటీ టవర్ అందుబాటులోకి రావడంతో ఆదిలాబాద్ ప్రాంతంలో ఐటీ ఆధారిత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్థానికులు ఆశిస్తున్నారు.

భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడత రీసర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలి
రీసర్వేలో నాణ్యతకు ప్రాధాన్యత
తొందర పాటుతో తప్పులకు తావివ్వకూడదు
మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలి
రీసర్వేలో అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు
భూముల రీసర్వే ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ముద్ర, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, సానుకూల వాతావరణంలో పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల రీసర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాలలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు రెవెన్యూ అంశాలపై సమీక్షలు నిర్వహించామని తెలిపారు. రీసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు గ్రౌండ్ రిపోర్టులను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రీసర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నామని తెలిపారు.రీసర్వే ఎస్ఓపీని పకడ్బందీగా అమలు చేయాలిభూముల రీసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను అధికారులు పక్కాగా అమలు చేయాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. కేవలం ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలు కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా నివేదికలు ఉండాలని స్పష్టం చేశారు.నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రీసర్వే పనుల్లో అధికారులు పూర్తి బాధ్యతతో, చిత్తశుద్ధితో వ్యవహరించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.మండలాల వారీగా సర్వే బృందాల ఏర్పాటుప్రతి మండలంలో రీసర్వే కోసం అవసరమైన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు సర్వే బృందాల సంఖ్యను పెంచాలని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.రీసర్వేలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరిరీసర్వే జరిగే సమయంలో సంబంధిత గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, స్థానిక రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. సర్వే నివేదికల పై అభ్యంతరాలు ఎలా సమర్పించాలి, ఎక్కడ సమర్పించాలి, ఏ విధంగా పరిష్కరించబడతాయి అనే అంశాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని ఆదేశించారు.రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే వివరాలను ప్రజలకు తెలియజేస్తూ దండోరా వేయించాలని, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. ప్రజలకు రీసర్వే వివరాలు పూర్తిస్థాయిలో తెలియజేయాలని, వచ్చిన అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రికార్డులు కచ్చితత్వంతో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అసైన్డ్ భూముల పట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలిఅసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములపై ఆధీనంలో ఉన్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని అనుభవిస్తున్నట్లయితే, ప్రస్తుత అనుభవదారుడు అర్హుడా కాదా అనే అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు. పట్టాలో పేర్కొన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షేత్రస్థాయిలో సరిచూసుకోవాలని తెలిపారు.సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.రీసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా, రీసర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓ లు గంగయ్య,సురేష్,సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా

ప్రపంచ సమస్యలకు పరిష్కారాలే 'భారత్ సమ్మిట్' లక్ష్యం

రాహుల్ గాంధీని మళ్లీ పరిచయం చేయాల్సిన అవసరం లేదు..
ఆయన జాతీయ, అంతర్జాతీయ నాయకుడు: మంత్రి శ్రీధర్‌బాబు
యువత, సాంకేతికత, జెన్‌జీ సమస్యలపై చర్చ..
ఎస్ఐఆర్ అంశమూ సమ్మిట్‌లో ప్రస్తావన



ముద్ర, హైదరాబాద్, నవంబరు 11: ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు చర్చల ద్వారా పరిష్కార మార్గాలు అన్వేషించడమే 'భారత్ సమ్మిట్' ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సదస్సును రాజకీయ ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారనే విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ముఖ్యంగా యువత, సాంకేతిక పరిజ్ఞానం, జెన్‌జీ (Gen Z) తరం లేవనెత్తుతున్న అంశాలపై మేధోపరమైన చర్చలు జరగనున్నాయని వెల్లడించారు.హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో భారత్ సమ్మిట్‌పై నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రగతిశీల ఆలోచనలతో ముందుకు సాగుతోందని, బీజేపీ భావజాలం భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు.బీజేపీ నేతలు భారత్ సమ్మిట్‌ను రాహుల్ గాంధీని మళ్లీ రాజకీయంగా పరిచయం చేయడానికి నిర్వహిస్తున్నారంటూ చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. రాహుల్ గాంధీ ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ఆయనను ప్రత్యేకంగా మళ్లీ పరిచయం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ తర్వాత ఎవరిని పరిచయం చేయాలనే అంశంపై బీజేపీ ఆలోచించుకోవాలని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఆలోచనా విధానాన్ని బీజేపీ ఎప్పటికీ అర్థం చేసుకోలేదని అన్నారు. Deccan Chronicle+1భారత్ సమ్మిట్‌ను కేవలం రాజకీయ కోణంలో చూడకూడదని, ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లపై వివిధ రంగాల నిపుణులు, ప్రతినిధులతో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నదే తమ ఉద్దేశమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఈ సదస్సు ఆర్థిక సదస్సు తరహాలోనూ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.యువతకు సంబంధించిన అంశాలు, సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులు, జెన్‌జీ యువత లేవనెత్తుతున్న సమస్యలు, అభిప్రాయాలపై ప్రత్యేకంగా చర్చలు ఉంటాయని తెలిపారు. సమకాలీన సమస్యలపై యువత ఆలోచనలు, సూచనలకు ఈ వేదిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపైనా సమ్మిట్‌లో చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం చేపడుతున్న చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ భావిస్తోందని, ఈ అంశంపై తమ అభిప్రాయాలను చర్చల్లో ప్రస్తావిస్తామని తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ రెండో విడత జరగనుంది. ప్రపంచ సమస్యలు, ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక అంశాలు, యువత, సాంకేతికత తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరగనున్నాయి.

యువజనోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ముద్ర, భూపాల్‌పల్లి: యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను, కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఈ నెల 17 న ఇల్లందు క్లబ్‌హౌస్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి యువ జనోత్సవాలు–2026 కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువతీ యువకులు తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకు యువజనోత్సవాలు చక్కటి అవకాశమని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే సాంస్కృతిక పోటీల్లో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. యువజనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు, జిల్లా యువజన శాఖ సీనియర్ అసిస్టెంట్ డి. లావణ్య కుమారి, శివసాగర్ పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, నోట్‌బుక్స్ పంపిణీ
అందరికీ విద్య అందాలన్నది ఆజాద్ ఆశయం..
ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



ముద్ర, కరీంనగర్, నవంబరు 11:భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ ఆధ్వర్యంలో కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దపల్లి రోడ్డు ఫ్లైఓవర్ వద్ద ఉన్న ఆజాద్ విగ్రహానికి వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసిన పురుమల్ల శ్రీనివాస్, ఎండీ తాజుద్దీన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మోసిన్, పీసీసీ అధికార ప్రతినిధి సిరాజ్ హుస్సేన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీజిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, 27వ డివిజన్ అధ్యక్షుడు కిమ్ ఫహద్ ఆధ్వర్యంలో అహ్మద్‌పురాలోని షాషాబ్ ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని 9, 10వ తరగతుల విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు.అదేవిధంగా నగర కాంగ్రెస్ మైనారిటీ సెల్ నాయకుడు అహ్మద్ అలీ ఆధ్వర్యంలో ఖాన్‌పూర్‌లోని గల్ఫ్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యుల అంజన్ కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్, పీసీసీ అధికార ప్రతినిధి ఎస్.కె. సిరాజ్ హుస్సేన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఏ. మోసిన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్లు పంపిణీ చేశారు.అందరికీ విద్య అందించాలన్నదే ఆజాద్ ఆశయంఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ఎండీ తాజుద్దీన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యకు దూరంగా ఉన్న వర్గాలకు చదువును చేరువ చేయాలన్న లక్ష్యంతో ఆయన కృషి చేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా బాలికల విద్య, ఉన్నత విద్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో పాఠశాల ఉండాలని, ప్రతి ఒక్కరికీ విద్య అందాలని ఆజాద్ ఆకాంక్షించారని తెలిపారు. ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి పునాదులు వేసిన దార్శనికుల్లో ఆయన ఒకరని కొనియాడారు. విద్య ద్వారానే వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధ్యమని ఆయన నమ్మారని, ఆ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యంముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై అనేక సమస్యలు ఉండేవని, ప్రస్తుతం పాఠశాలల్లో వసతులు, బోధనా సిబ్బంది కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికత, శాస్త్ర విజ్ఞానం, సాఫ్ట్‌వేర్‌తో పాటు అన్ని రంగాల్లో భారతదేశం మరింత ముందుకు సాగాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, ఇక్రమ్, పర్వత మల్లేశం, అబ్దుల్ రెహమాన్, నిహాల్, అమీర్, కందుద్దిన్, మాదాసు శ్రీనివాస్, షాహిద్, జమాలుద్దీన్, సలీముద్దీన్, ఇమ్రాన్, కలిముద్దీన్, ఆరిఫ్, షబానా, మహమ్మద్ హనీఫ్, హాజీ, ఇమ్రాన్ గని, మూల జయపాల్, చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12.11.2026
www.mudranews.in | @mudranews

సోంపు : యాంటీఆక్సిడెంట్లతో ఆరోగ్య రక్షణ

సోంపులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడతాయి. మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తాయి.



ఎన్నికలకు హామీని నిలబెట్టుకున్న రేకొండ సర్పంచ్


*** సొంత ఖర్చులతో 500కోతులను పట్టుకొని ..మంథని అడవికి తరలింపు..**
*** గ్రామస్తుల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యం.. ఊపిరి పీల్చుకుంటున్న రేకొండ ప్రజలు.**



ముద్ర చిగురుమామిడి: గ్రామ అభివృద్ధి,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు.గ్రామంలో తీవ్రంగా ఉన్న కోతుల బెడదను వదిలించేందుకు బుధవారం ఆయన తన సొంత ఖర్చులతో దాదాపు 500కోతులను ప్రత్యేక బృందాల ద్వారా గ్రామంలోని పెద్దమ్మ పల్లె వద్ద పట్టించారు.అనంతరం ఆ కోతులను సురక్షితంగా మంథని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు సర్పంచ్ వివరించారు.గత సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామాన్ని కోతుల రహితంగా మారుస్తానని గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని సర్పంచ్ అల్లెపు సంపత్ అక్షరాలా నిలబెట్టుకుంటున్నారు.సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఆయన అనేకసార్లు కోతులను పట్టించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.అయినప్పటికీ, ఇటీవల మళ్లీ కోతుల సంఖ్య పెరగడం గ్రామస్తులను, రైతులు తీవ్ర ఇబ్బందులు పేడుతున్న విషయాన్ని గమనించిన సర్పంచ్,తక్షణమే స్పందించి ఈ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో కోతుల బెడద వల్ల ఇళ్లను వదిలి బయటకు రాలేకపోతున్నామని,పంటలు దెబ్బతింటున్నాయని,ఊరిలో కుక్కల బెడద కూడా తోడవడంతో తీవ్ర ఆందోళనతో సహవాసం చేయాల్సి వస్తోందని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించిన సర్పంచ్ సంపత్ ఎన్ని కోతులు పట్టించినా, ప్రజలకు శాశ్వత ఉపశమనం లభించే వరకు తన వంతు కృషిని కొనసాగిస్తానని,గ్రామ సంక్షేమమే తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సర్పంచ్ తీసుకున్న ఈ చొరవపై రేకొండ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ ప్రజలు కోతులు,కుక్కలతో జాగ్రత్తగా ఉండాలని, కుక్కలు,కోతులు ప్రజలపై దాడి చేస్తున్నాయని తగు జాగ్రత్త తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్,వార్డు సభ్యులు పిట్టల సరోజన వెంకట్రాజం కోరారు.

దేశిని చిన్న మల్లయ్యకు ఘన నివాళి

9వ వర్ధంతి సందర్భంగా స్వగ్రామం బొమ్మనపల్లిలో నివాళులర్పించిన నాయకులు



ముద్ర, చిగురుమామిడి: కల్లుగీత కార్మిక ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్యే అమరజీవి కామ్రేడ్ దేశిని చిన్న మల్లయ్య పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతామని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. చిన్న మల్లయ్య 9వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1932లో బొమ్మనపల్లిలో జన్మించిన చిన్న మల్లయ్య చిన్నతనంలోనే కల్లుగీత వృత్తిని చేపట్టి జీవనం సాగించారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పనిచేసి, 1953లో కమ్యూనిస్టు పార్టీలో చేరారని తెలిపారు. 1957 నుంచి 1978 వరకు 21 ఏళ్ల పాటు సర్పంచిగా, 1978 నుంచి 1994 వరకు వరుసగా నాలుగుసార్లు ఇందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశారని గుర్తుచేశారు. కల్లుగీత కార్మిక సంఘం అభివృద్ధికి, సొసైటీలు, పెన్షన్లు, ఎక్స్‌గ్రేషియా వంటి హక్కుల సాధనకు విశేష కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం గీత కార్మికుల హక్కులపై పోరాటం కొనసాగిస్తామన్నారు. సంఘం పోరాట ఫలితంగా ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న రూ.20 కోట్ల ఎక్స్‌గ్రేషియా విడుదల, పెన్షన్ల కోసం 37,381 కొత్త దరఖాస్తుల స్వీకరణ జరిగాయని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు పెన్షన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచడంతో పాటు సభ్యులకు ద్విచక్ర వాహనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకటనర్సయ్య, సురుగు రాజేష్ గౌడ్, కోహెడ కొమరయ్య గౌడ్, తాళ్లపల్లి తిరుపతి గౌడ్, పచ్చిమట్ల రవీందర్, చిన్న మల్లయ్య కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విదేశీ శక్తులన్నీ అలయెన్స్ పేరుతో ఒక్కటయ్యాయి

ముద్ర, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న భారత్ సమిట్‌పై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. ఇది అసలు భారత్ సమిట్ కాదని... యాంటీ భారత్ సమిట్ అని ఆరోపించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశానికి వ్యతిరేకంగా కుట్రలు చేసే విదేశీ శక్తులన్నీ ప్రోగ్రెసివ్ అలయెన్స్ పేరుతో ఒక్కటయ్యాయని విమర్శలు గుప్పించారు. ఈ కూటమిలో రాహుల్ గాంధీ కూడా సభ్యుడన్నారు. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిల్లీలో సమావేశమయ్యారని... సోనియా గాంధీ కూడా వారితో భేటీ అయ్యారని తెలిపారు. ఈ సంస్థ వెనుక జార్జ్ సోరోస్ వంటి వ్యక్తులు ఉన్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు ఈ సంస్థలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. స్పెయిన్, ఫ్రాన్స్, అల్బేనియా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో కూడా ఈ కూటమి అలజడులకు కారణమైందని ఆరోపించారు. ఇప్పుడు అదే విదేశీ శక్తులు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని భారతదేశంలో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని దుయ్యబట్టారు. విఫలమైన రాహుల్ గాంధీని రాజకీయంగా మళ్లీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ భారత్ సమిట్ నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. 100 దేశాల నుంచి వచ్చే ప్రతినిధుల ముందు రాహుల్ గాంధీని ప్రధానమంత్రి స్థాయి నాయకుడిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

అమ్మాయిల ప్రాణాలతో చెలగాటం.. ఐవీఎఫ్ మాఫియా గుట్టు రట్టు




ముద్ర, హైదరాబాద్ : ఐవీఎఫ్, ఫెర్టిలిటీ, ఏఆర్టీ సెంటర్ల పేరుతో జరుగుతున్న భారీ అక్రమ దందాపై మల్కాజిగిరి పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఉపాధి పేరుతో యువతులను హైదరాబాద్ కు తీసుకొచ్చి, వారి నుంచి బలవంతంగా అండాలను సేకరిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసి, 20 ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు జారీ చేసి, అండాల సేకరణ దర్యాప్తు కోసం ప్రత్యేక విచారణ బృందం (సిట్) ను ఏర్పాటు చేసినట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. అమిత్ శర్మ, దుర్గా ప్రసాద్ లను అరెస్ట్ చేసిన తర్వాతే ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్ల అక్రమాలు వెలుగులోకి వచ్చాయని సీపీ సుమతి తెలిపారు. అదే కోణంలో దర్యాప్తు చేస్తున్న బేగంపేట్ పోలీసులు నకిలీ ఆధార్ కార్డులు తయారు చేస్తున్న ప్రవీణ్ ను అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు బయటపడినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆరు రాష్ట్రాల నుంచి అమ్మాయిలను అక్రమ రవాణా చేస్తున్నారని సీపీ ఆరోపించారు. ఉద్యోగం కోసం హైదరాబాద్ కు వచ్చిన యువతులను ట్రాప్ చేసి, మంచి జీతం, షెల్టర్ ఇప్పిస్తామని నమ్మించి తీసుకొస్తున్నారని విచారణలో తేలినట్లు పోలీసులు చెబుతున్నారు. పలు ఐవీఎఫ్ కేంద్రాలు వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నడుపుతూ, అక్కడే అక్రమ దందాలు నడుపుతున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. జీతానికి ఆశపడి వచ్చిన యువతుల నుంచి బలవంతంగా అండాలను సేకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో అమ్మాయికి హార్మోన్లు ఇచ్చి అండాలను సేకరిస్తున్నారని, ఒక్కో యువతి నుంచి పదేపదే అండాలను సేకరించడం వల్ల వారి ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతోందని సీపీ సుమతి ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మాయిల ప్రాణాలతో ఐవీఎఫ్ సెంటర్లు చెలగాటం ఆడుతున్నాయని ఆమె అన్నారు. ఈ వ్యవహారంలో గుజరాత్ తో పాటు హైదరాబాద్ కు చెందిన ముఠా సభ్యులే కీలక పాత్ర పోషిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

మెడికల్ డిపార్ట్ మెంట్ అనుమతి లేకుండానే అండాలను సేకరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం అండాల సేకరణ వివరాలను తప్పనిసరిగా మెడికల్ డిపార్ట్ మెంట్ లో, ఏఆర్టీకి నమోదు చేయాలి. కానీ యువతుల వివరాలను ఏఆర్టీకి ఇవ్వకుండానే అండాలను సేకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు, నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి తప్పుడు సమాచారాన్ని ఏఆర్టీకి ఇస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉపాధి కోసం వచ్చిన యువతుల ఆధార్ కార్డుల అడ్రస్ లు మార్చి ఏఆర్టీకి సమర్పిస్తున్న ప్రవీణ్ ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఏఆర్టీ సెంటర్లే అక్రమాలకు అడ్డాగా మారాయని సీపీ సుమతి అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఏఆర్టీ సెంటర్ల అనుమతులు తీసుకుని, ఇక్కడ అక్రమంగా నడుపుతున్నట్లు విచారణలో తేలిందని ఆమె చెప్పారు. ఈ కేసులో భాగంగా అధికారులు ఏకంగా 20 ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. నోటీసులు అందుకున్న వాటిలో ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ,పద్మజ ఫెర్టిలిటీ సెంటర్, నోవా ఫెర్టిలిటీ సెంటర్, బటర్ ఫ్లై ఫెర్టిలిటీ సెంటర్, ఇందిరా ఫెర్టిలిటీ సెంటర్, నర్మదా ఫెర్టిలిటీ సెంటర్, బిర్లా ఫెర్టిలిటీ సెంటర్, అన్వి ఫెర్టిలిటీ సెంటర్, కాంశివ ఫెర్టిలిటీ సెంటర్, మర్రి తులసి రెడ్డి సెంటర్, 49 ఫెర్టిలిటీ సెంటర్, మమత ఫెర్టిలిటీ సెంటర్, సద్గురు ఏఆర్టీ సెంటర్, నోవా ఐవీఎఫ్ సెంటర్, ఫాతిమా ఫెర్టిలిటీ సెంటర్, ఆరాధ్య ఐవీఎఫ్ సెంటర్ తదితరాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సెంటర్లలో నిబంధనల ఉల్లంఘన జరిగిందా, అండాల సేకరణ వివరాలు సక్రమంగా నమోదు చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. అమ్మాయిల జీవితాలతో చెలగాటమాడుతున్న ఐవీఎఫ్, ఫెర్టిలిటీ, ఏఆర్టీ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సుమతి హెచ్చరించారు. అండాల సేకరణ దర్యాప్తు కోసం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశామని ఆమె ప్రకటించారు. ఈ కేసులో మరింత మంది నిందితుల ప్రమేయం ఉందా, ఇతర రాష్ట్రాలతో లింకులు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు.

వివాహ బంధంతో ఒక్కటైన అనిరుధ్ - కావ్యా మారన్



ముద్ర, చెన్నై : సంగీత దర్శకుడు అనిరుధ్ , కావ్యా మారన్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. గ్రీస్‌లో బుధవారం (నవంబరు 11) అంగరంగ వైభవంగా వీరి వివాహ వేడుక జరిగింది. అగ్ర నటుడు రజనీకాంత్, తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్ సహా తమిళనాడుకు చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తమ వివాహానికి సంబంధించిన ఫొటోలను అనిరుధ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'జీవితంలో ఒక్కసారే వచ్చే సందర్భం, జీవితాంతం. 11.11' అని క్యాప్షన్ జోడించారు.

ఫేక్ శాలరీ స్లిప్స్ తో ICICI బ్యాంకుకు టోకరా



ముద్ర, హైదరాబాద్: ఉద్యోగం లేదు.. బ్యాంక్ అకౌంట్ లేదు.. అయినా ప్రైవేటు ఉద్యోగం చేస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నట్లు నకిలీ శాలరీ స్లిప్స్ సృష్టించి, ఏకంగా బ్యాంకు నుంచి రూ.30 లక్షల రూపాయల రుణం కొట్టేసిన ముఠాను ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగులోకి వచ్చిన ఈ మోసపూరిత వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారింది. నిందితులు ఐదుగురు ఏజెంట్లతో కలిసి పక్కా ప్లాన్ తో ఈ మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు, జీతపు స్లిప్పులు నకిలీవి సృష్టించారు. అంతేకాదు, నకిలీ ఆధార్ కార్డులు, పాన్ కార్డులు కూడా తయారు చేసి బ్యాంకుకు సమర్పించినట్లు విచారణలో తేలింది. నిజానికి నిందితులకు ఎలాంటి ఉద్యోగం లేదని, బ్యాంక్ అకౌంట్ కూడా లేదని పోలీసులు గుర్తించారు. అయినా ప్రైవేటు ఉద్యోగం చేస్తూ లక్షల్లో జీతం తీసుకుంటున్నట్లు ఫేక్ డాక్యుమెంట్లు చూపించి ICICI బ్యాంకు నుంచి రూ.30 లక్షల రుణం పొందినట్లు పోలీసులు చెబుతున్నారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని ప్రస్తుతం విచారిస్తున్నారు.

ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం బ్యాంక్ అధికారుల పాత్ర. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా, ఎలాంటి పత్రాలు సరిగా లేకుండానే రూ.30 లక్షల రుణాన్ని ఎలా శాంక్షన్ చేశారన్న దానిపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. బ్యాంక్ అధికారులకు ఈ ముఠాతో సంబంధం ఉందా, నిర్లక్ష్యంతో లోన్ ఇచ్చారా, లేక కుమ్మక్కయ్యారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా ఇంకా ఎన్ని బ్యాంకులను ఇదే తరహాలో మోసగించింది, ఇంకా ఎంతమంది బాధితులు ఉన్నారనే కోణంలోనూ విచారణ కొనసాగుతోందని ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు.

ఇకపై డ్రగ్స్ జోలికి వెళ్లం..

గీతం యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిజ్ఞ

ముద్ర, హైదరాబాద్ : డ్రగ్స్ మహమ్మారి నుంచి యువ విద్యార్థులను కాపాడేందుకు తెలంగాణ ఈగల్ ఫోర్స్ మరో ముందడుగు వేసింది. డ్రగ్స్ తీసుకున్నట్లు గుర్తించిన గీతం యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అబిడ్స్ లోని ఈగల్ ఫోర్స్ కార్యాలయంలో నవంబర్ 10న కౌన్సెలింగ్ నిర్వహించింది. ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, ఐపీఎస్ అధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. డ్రగ్స్ సేవించినట్లు గుర్తించిన నలుగురు విద్యార్థులను వారి తల్లిదండ్రులతో సహా ఈగల్ ఫోర్స్ కార్యాలయానికి పిలిపించారు. కుటుంబ సభ్యుల సమక్షంలోనే కౌన్సెలింగ్ నిర్వహించి, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇద్దరూ ఈ సమస్య తీవ్రతను, సకాలంలో జోక్యం చేసుకోవడం ఎంత అవసరమో అర్థం చేసుకునేలా చేశారు.కౌన్సెలింగ్ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై, చదువుపై, వ్యక్తిగత సంబంధాలపై, భవిష్యత్ కెరీర్ పై పడే దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ సంబంధిత కార్యకలాపాల వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలను, అది వారి విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తుపై ఎలా ప్రతికూల ప్రభావం చూపుతుందో వివరించారు. స్వీయ క్రమశిక్షణ పాటించాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, బాధ్యతాయుతమైన స్నేహాలు ఎంచుకోవాలని, చదువు, వ్యక్తిగత అభివృద్ధి, కెరీర్ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. కౌన్సెలింగ్ విద్యార్థులపై సానుకూల ప్రభావం చూపింది. తమ తప్పును అంగీకరించిన విద్యార్థులు పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్నారు. భవిష్యత్తులో డ్రగ్స్ సేవించబోమని, చదువు, కెరీర్ అభివృద్ధిపై దృష్టి పెడతామని అధికారులకు హామీ ఇచ్చారు. మళ్లీ ఇలాంటి ప్రవర్తన పునరావృతం చేయవద్దని అధికారులు హెచ్చరించారు.

హైదరాబాద్ వేదికగా 'భారత్ సమ్మిట్-2026'..

- అన్ని పార్టీల నేతలకు ఆహ్వానం..

ముద్ర, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక 'భారత్ సమ్మిట్-2026'కు సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఈ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా విద్వేష రాజకీయాలు, సామాజిక విభజన పెరుగుతున్న తరుణంలో ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల భావాలు కలిగిన వారిని ఒకే వేదికపైకి తెచ్చి నూతన దిశానిర్దేశం చేయడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమానికి 70కి పైగా దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు, మేధావులు హాజరుకానున్నారు. మహాత్మా గాంధీ బోధించిన అహింసా మార్గం, నెహ్రూ ప్రవచించిన అలీన విదేశాంగ విధానం, మిశ్రమ ఆర్థిక విధానాల ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ సదస్సు సాగనుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాలు శత్రువులు కాదని, కేవలం రాజకీయ ప్రత్యర్థులు మాత్రమేనని స్పష్టం చేశారు. భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ ప్రతిపక్షాల గొంతుకను పరిరక్షించడమే అసలైన ప్రజాస్వామ్య సూత్రమని పేర్కొంటూ, అన్ని పార్టీల నాయకులను ఈ చర్చకు ఆహ్వానించారు. ఆర్థిక విధానాలకు దావోస్ వేదికైనట్లే, సామాజిక-రాజకీయ చర్చలకు హైదరాబాద్ అంతర్జాతీయ వేదికగా మారనుందని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం, నెహ్రూ జయంతి వేళ జరుగుతున్న ఈ సమ్మిట్‌ను విజయవంతం చేయడానికి మీడియా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

BHARAT SUMMIT
DELIVERING GLOBAL JUSTICE

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12.11.2026
www.mudranews.in | @mudranews

సోంపు : జుట్టు కుదుళ్లకు బలం!

సోంపులోని పోషకాలు జుట్టు ఆరోగ్యానికి తోడ్పడతాయి. జుట్టు బలంగా పెరగడానికి అవసరమైన పోషకాలను అందించడంలో సహాయపడతాయి.



ఏడుపాయలలో కార్తీక దీపారాధన

ముద్ర ప్రతినిధి, మెదక్:ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండపంలో దీపాలు వెలిగించి, ఆకాశ దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు పార్థివ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు. దుర్గా నామస్మరణ శివ, కేశవ నామ స్మరణ మారుమ్రోగింది.



ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి, ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం మినీ మీటింగ్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, వివిధ పొలిటికల్ పార్టీ నాయకులతో సార్, ఎమ్మెల్సీ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని



అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిన ప్రక్రియపై జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు నవంబర్ 21 వరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు గడువు పొడగించడం జరిగిందని తెలిపారు . బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎ ఎస్ డి డి జాబితాలో ఉన్న ఓటర్లను సంప్రదించి, వారికి అనుబంధ ఫారాలను అవసరాన్ని బట్టి ప్రకటన పత్రాల సమర్పణ విధానాన్ని వివరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించిందని అన్నారు.వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఓటరు నమోదు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆలేరు బాలికల మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల తనిఖీ



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)ను బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పాఠశాలలో చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలోని వంటగది, భోజనశాల, మరుగుదొడ్లు, విద్యార్థినుల వసతి గదులను పరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, వసతి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి విద్యా బోధన, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థినులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. సబ్జెక్టుల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఉన్నత విద్యతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ తదితర సాంకేతిక విద్యా కోర్సులు, వివిధ పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం ఆలేరు మండలంలోని బహద్దూర్ పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఉన్న చిన్న పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ప్రతిరోజు ఆహారం మంచిగా అందిస్తున్నారా, గుడ్డు పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే చదువు పై పిల్లలను చిన్న చిన్న ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జయమ్మ, జిల్లా విద్యా శాఖ అధికారి బిక్షపతి, ఎమ్మార్వో ఆంజనేయులు, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కు నివాళి



ముద్ర ప్రతినిధి, మెదక్: విద్యా వైతాళికుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి★ వేడుకలను నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయం వద్ద అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద మిల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎండి మన్సూర్, అవారి రాజశేఖర్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ తాహేర్, అనూష, పట్టణ మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ ఫాజిల్, మైసన్ బిన్ అబ్దుల్లా, పట్టణ ఎస్సీ సెల్ చైర్మన్ చిన్నారుల ప్రవీణ్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్



రామస్వామి, సయ్యద్ ఓమర్, పట్టణ మాజీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు స్వరూప, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాడి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీర్, దేవి సింగ్ నాయక్, ముజామిల్, భూపతి యాదవ్, పోచందర్, సలీం, బాలరాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ లలు, మహమ్మద్ సమీయుద్దీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మాయిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :రైతులు దళారులను ఆశ్రయించకుండా, నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే వడ్లను అమ్ముకొని లబ్ధి పొందాలని భువనగిరి మున్సిపల్ ఛైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలోని 11వ వార్డు బొమ్మాయిపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కేంద్రాన్ని ప్రారంభించి, రైతులకు వడ్ల కొనుగోలు విధానం, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోలు సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ పొతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు,11వ వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ సర్వే

మెదక్ ఆర్డీవో రమాదేవి



ముద్ర ప్రతినిధి, మెదక్:పకడ్బందీగా రీ సర్వే నిర్వహించాలని ఆర్డీవో రమాదేవి సర్వే అధికారులకు సూచించారు. బుధవారం మెదక్ మండలం కోంటూరు గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను ఆర్డీవో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.రీ సర్వేలో భాగంగా సరిహద్దులు, భూ వివాదాలు లేకుండా నిర్వహించి ,రీ సర్వే జరుగుతున్నపుడు రైతులకు సమాచారం తప్పకుండా ఉండాలని అధికారులు ఆమె సూచించారు.

16న అగ్రిగోల్డ్ బాధితుల వివరాల నమోదు

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లాలో అగ్రిగోల్డ్ బాండ్లు కొనుగోలు చేసి బాధితులుగా ఉన్నవారు ఈ నెల 16న మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయానికి రావాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. అగ్రిగోల్డ్ బాండ్ బాధితుల వివరాల సేకరణలో భాగంగా సీఐడీ అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి వివరాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అగ్రిగోల్డ్ బాండ్లు కలిగి ఉండి, బాధితులుగా ఉన్నవారు నిర్ణీత తేదీన కార్యాలయానికి హాజరై తమ వివరాలను సంబంధిత అధికారులకు అందజేయాలని ఎస్పీ తెలిపారు. బాధితులు తమ వద్ద ఉన్న అగ్రిగోల్డ్ బాండ్లు, రసీదులు, ఇతర సంబంధిత ఆధారాలు, గుర్తింపు కార్డులను వెంట తీసుకురావాలని సూచించారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో

నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

ముద్ర ప్రతినిధి మెదక్: మైనర్ బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి జిల్లా పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. చదువును మధ్యలోనే నిలిపివేసి ఇంటి వద్ద ఉంటున్న మైనర్ బాలికకు ఆమె తల్లి కామారెడ్డి జిల్లాకు చెందిన మామిడ్ల సంజీవ్ అనే వ్యక్తితో వివాహం చేయాలని భావించింది. ఈ క్రమంలో ఇరువురి ఫొటోలు, ఫోన్ నంబర్లు పరస్పరం మార్చుకున్నారు. అప్పటి నుంచి బాలిక, సంజీవ్ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో సంజీవ్ తనను ప్రేమిస్తున్నానని చెప్పగా బాలిక అంగీకరించింది. అయితే బాలిక వయస్సు తక్కువగా ఉండటంతో ప్రస్తుతం వివాహం చేయడం సరికాదని ఆమె తల్లి నిర్ణయించుకుంది.ఈ కేసు 2021 మే 11న జరిగింది. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన తూప్రాన్ డీఎస్పీ కిరణ్ కుమార్ సమగ్ర దర్యాప్తు చేపట్టి, అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభవలి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా



విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసు విచారణలో మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్, కోర్టు లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించారు.

ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇండ్లు గ్రామసభలలో ఎంపిక చేయాలి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలల్లో ప్రభుత్వ పథకాలు (ఇందిరమ్మ ఇండ్లు)అర్హులైన లబ్ధిదారులకు గ్రామసభల ద్వార ఎంపిక చేయాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ సర్పంచ్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, భువనగిరి మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు, నాగిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ జక్క రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, హౌజింగ్ పి.డి కి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ సానుభూతిపరులు సర్పంచ్లుగా లేని గ్రామాలల్లో అధికారులు వారి ఇష్టాను సారంగా ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక చేయడం జరిగిందన్నారు. తక్షణమే లబ్ధిదారుల జాబితాను రద్దు చేసి గ్రామ సర్పంచ్ల అధ్యక్షతన గ్రామ సభలు ఏర్పాటు చేయించి అర్హులైన లబ్ధిదారులకు ఎంపిక చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పనుమటి మమతనరేందర్ రెడ్డి, జనగాం పాండు, అతికం అరుణ లక్ష్మీనారాయణ గౌడ్, ర్యాకల సంతోష శ్రీనివాస్, గోద అరుణ శ్రీనివాస్ గౌడ్, కటికే జంగయ్య, గిరిజరమేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, బి.సునీత, కంకల కిష్టయ్య, కమ్మగాని మంజుల నర్సింహ గౌడ్, బోడిగే లింగాస్వామి, తరిమి లలిత, బత్తుల కళమ్మ, మద్దెల మంజులసందీప్, లింగాస్వామి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె

కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఎంహెచ్ఓకు సమాచారం

ముద్ర ప్రతినిధి, మెదక్: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 41,330 మంది ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, డిసెంబర్ 15 నుంచి నిరవధిక రాష్ట్రవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో సమ్మెకు సంబంధించిన ముందస్తు సమాచారంతో పాటు తమ డిమాండ్లను వివరిస్తూ బుధవారం కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి కనీస హక్కులు



కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పిఎఫ్, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, అకారణంగా విధుల నుంచి తొలగించకుండా చూడాలని అదనపు విధులు, పనిభారాన్ని తగ్గించాలని, పెండింగ్ బకాయిలు, ప్రోత్సాహకాలను వెంటనే చెల్లించాలని ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధ్యక్షులు జుబేర్ అహ్మద్ డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల జిల్లా అధ్యక్షురాలు సమత, ప్రధాన కార్యదర్శి దర్శ, లత, శ్రవంతి, మహేశ్వరి, కవిత, శారద, మునితదితరులున్నారు.

డీసీసీ ఎస్సీ వైస్ చైర్మన్ గా రామస్వామి



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ గా మెదక్ పట్టణానికి చెందిన బైండ్ల రామస్వామి నియమితులయ్యారు. టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ కబంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు డీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ తాడేపు మహేందర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఉత్తర్వులను రామస్వామికి అందజేశారు. తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 12.11.2026
www.mudranews.in | @mudranews

సోంపు : జీర్ణక్రియకు మంచి మేలు!

రోజూ సోంపు నీరు తాగడం వల్ల జీర్ణక్రియకు సహాయపడుతుంది. గ్యాస్, అజీర్ణి, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



డిసెంబర్ చివరి నాటికి

రెడ్లకుంట ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలి

నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలి
అధికారులకు, గుత్తేదారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
ఆరు గ్రామాల్లో 4,460 ఎకరాలకు అందనున్న సాగునీరు

ముద్ర, సూర్యాపేట: రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించి, ఆయకట్టు భూములకు సకాలంలో నీరందించడమే లక్ష్యంగా రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు.సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట ఎత్తిపోతల పథకం పనులను మంత్రి పరిశీలించారు. పాలేరు వాగుపై రూ.47.64 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటివరకు 70 శాతం పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కాలువల నిర్మాణం, భూగర్భ మోటార్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆరు గ్రామాలకు సాగునీటి ప్రయోజనంరెడ్లకుంట ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే కోదాడ మండల పరిధిలోని ఆరు గ్రామాలకు చెందిన 4,460 ఎకరాల ఆయకట్టుకు వానాకాలం, యాసంగి రెండు పంటల సీజన్లలో సాగునీరు అందనుంది. ఒక్కొక్కటి 430 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వీటీ మోటార్ల ద్వారా పాలేరు వాగు నుంచి నీటిని ఎత్తిపోసి ఆయకట్టుకు సరఫరా చేయనున్నారు.గ్రామాల వారీగా సాగునీటి ప్రయోజనాలు ఇలా ఉన్నాయి:– కాపుగల్లు – 1,608 ఎకరాలు– నల్లబండగూడెం – 1,400 ఎకరాలు– రెడ్లకుంట – 576 ఎకరాలు– చిమిరాల – 410 ఎకరాలు– కూచిపూడి – 400 ఎకరాలు– ద్వారకుంట – 66 ఎకరాలుఈ పథకం ద్వారా మొత్తం 1,486 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. వీరిలో బీసీ కుటుంబాలు 720, ఎస్సీ కుటుంబాలు 446, ఓసీ కుటుంబాలు 290, ఎస్టీ కుటుంబాలు 30 ఉన్నాయి.రైతులకు మేలు చేకూర్చేలా పనులుఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే ఆరు గ్రామాల రైతులకు సాగునీటి భరోసా లభించనుంది. రెండు పంటలకు నీరు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల పనుల్లో జాప్యం జరగకుండా,



నాణ్యతతో కూడిన నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.మంత్రి పర్యటనలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పంగవీటి రామారావు, నీటిపారుదల శాఖ సీఈ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి



త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఆదేశందిక్కూచి, కోదాడ, నవంబరు 11:కోదాడ పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, ఆధునిక హంగులతో త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు కేవలం పరిపాలనా అవసరాలకే పరిమితం కాకుండా పట్టణానికి కొత్త అందాన్ని తీసుకువచ్చేలా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.బుధవారం కోదాడ పట్టణంలో పర్యటించిన మంత్రి వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ నూతన కార్యాలయ భవనం, రూ.8 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్లు, భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా షాదీఖానా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవన నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఆధునిక వాస్తుశిల్ప నమూనాలు, ఆకర్షణీయమైన నిర్మాణ శైలితో భవనాలను తీర్చిదిద్దాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు.ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాలతో పూర్తి చేయాలని, నిర్మాణాల పర్యవేక్షణలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనుల్లో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని అధికారులకు తెలిపారు.మంత్రి పర్యటనలో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టం కీలకం



డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్

ముద్ర ప్రతినిధి, మెదక్: కలెక్టరేట్ లో ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడం, పౌరుల దరఖాస్తులను చట్టబద్ధంగా పరిష్కరించడానికి సమాచార హక్కు చట్టం అమలుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణలను నిర్వహిస్తోందని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. చట్టం ప్రకారం 30 రోజుల్లో సమాచారం అందించాలని, పారదర్శకత, జవాబుదారీతనం పెంచడానికి చట్టం కీలకమన్నారు. పౌరులకు చట్టం విధానాలు, దరఖాస్తు ప్రక్రియ, సమాచారం పొందే హక్కులు గురించి వివరంగా తెలియజేశారు. ఈకార్యక్రమంలో శంకర్, పౌర సమాచార అధికారులు, సహాయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో సిక్కు మైనార్టీ విభాగానికి కమిటీ

రాష్ట్ర అధ్యక్షుడిగా జస్బీర్ సింగ్ సంధు, ప్రధాన కార్యదర్శిగా హర్‌ప్రీత్ సింగ్

ముద్ర, హైదరాబాద్, నవంబరు 11: తెలంగాణ రక్షణ సేన సిక్కు మైనార్టీల కోసం ప్రత్యేక రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర రాజకీయ చరిత్రలో తొలిసారిగా సిక్కు మైనార్టీ విభాగానికి ప్రత్యేక కమిటీని ప్రకటించినట్లు పార్టీ వెల్లడించింది. ఈ మేరకు సిక్కు మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. జస్బీర్ సింగ్ సంధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్. హర్‌ప్రీత్ సింగ్‌ను పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించారు.బుధవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కవిత నూతనంగా నియమితులైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజకీయ పార్టీల మైనార్టీ విభాగాల్లో సాధారణంగా ముస్లింలు, క్రైస్తవులతో పాటు సిక్కులు, ఇతర మైనార్టీలకు కూడా ప్రాతినిధ్యం కల్పిస్తుంటారు. అయితే, తెలంగాణ రక్షణ సేన ఇప్పటికే ముస్లిం, క్రైస్తవ మైనార్టీలకు వేర్వేరు కమిటీలను ప్రకటించగా, తాజాగా సిక్కు మైనార్టీల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.మైనార్టీ వర్గాల్లోని ఒక్కో సమూహానికి ప్రత్యేక సమస్యలు, అవసరాలు ఉంటాయని, వాటిని గుర్తించి ఆయా వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని కవిత పేర్కొన్నారు.సిక్కు మైనార్టీలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు, వారి సమస్యలను రాజకీయ వేదికపై ప్రస్తావించేందుకు అవకాశం కల్పించినట్లయింది.



పరాక్ లో రాష్ట్రం ఉన్నత స్థానం సాధించేలా కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ముద్ర, పెద్దపల్లి : జాతీయ స్థాయిలో నిర్వహించే పరాక్ మూల్యాంకనంలో తెలంగాణ రాష్ట్రం ఉన్నత స్థానం సాధించేలా ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సముద్రాల వంశీ మోహనాచార్యులు రూపొందించిన 'పరాక్‌అభ్యసన దీపిక' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, విద్యార్థులను పరీక్షల సమయంలో మాత్రమే కాకుండా ముందుగానే జాతీయ స్థాయి మూల్యాంకనానికి సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులను అనుసరించాలని, ముందస్తు ప్రణాళికతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.ప్రస్తుతం రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరంలో మూడో తరగతి స్థాయిలో ఎదుర్కోనున్న పరాక్ మూల్యాంకనాన్ని దృష్టిలో పెట్టుకొని రచ్చపల్లి ప్రధానోపాధ్యాయుడు ప్రత్యేక అభ్యసన మాడ్యూల్‌ను రూపొందించారు. కేంద్ర స్థాయి అభ్యసన ప్రమాణాలు, పాఠ్యాంశాలతో పాటు గత రెండు



సంవత్సరాల ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులకు కొంత క్లిష్టంగా ఉండే 25 ముఖ్యమైన అంశాలను ఎంపిక చేశారు. ప్రతి అంశానికి సంబంధించి 20 నుంచి 25 ప్రశ్నల చొప్పున స్వయంగా రూపొందించి వందలాది ప్రశ్నలతో ప్రత్యేక అభ్యసన దీపికను సిద్ధం చేశారు.విశేషమేమిటంటే, ఈ అభ్యసన దీపికను తన సొంత నిధులతో ముద్రించి ప్రతి విద్యార్థికి వ్యక్తిగతంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు జాతీయ స్థాయి మూల్యాంకనంలో వారు ఆత్మవిశ్వాసంతో రాణించేలా ఈ వినూత్న ప్రయత్నం చేపట్టారు.గత విద్యా సంవత్సరంలో కార్యక్రమంలో భాగంగా రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఎంపికైన పాఠశాలల్లో రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల కూడా ఉంది. ప్రత్యేక కార్యాచరణ, నిరంతర అభ్యాసం, ప్రణాళికాబద్ధమైన బోధనతో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. అదే స్ఫూర్తితో పరాక్ జాతీయ మూల్యాంకనంలోనూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక అభ్యసన దీపికను రూపొందించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికతో ప్రత్యేక అభ్యసన మాడ్యూల్‌ను రూపొందించి, తన సొంత నిధులతో ముద్రించి విద్యార్థులకు అందిస్తున్న రచ్చపల్లి ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సముద్రాల వంశీ మోహనాచార్యుల కృషి అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా జాతీయ స్థాయి మూల్యాంకనాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ షేక్, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సముద్రాల వంశీ మోహనాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఐదు శాతమే పనుల పురోగతా?

ప్రభుత్వ ఆసుపత్రులపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఏదని ప్రశ్నించిన మన్నె క్రిశాంక్

ముద్ర, హైదరాబాద్, నవంబరు 11: టిమ్స్ అల్వాల్ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెండేళ్ల కాలంలో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదని, గతంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు కూడా అదే ప్రకటన చేయడం ఏమిటని నిలదీశారు. బుధవారం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన టిమ్స్ అల్వాల్ ఆసుపత్రిని సందర్శించారు.ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. 2025 జనవరిలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్పెషల్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించి 90 శాతం పనులు పూర్తయ్యాయని ప్రకటించారని గుర్తుచేశారు. 2025 ఆగస్టు 31 నాటికి ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని తెలిపారు.అయితే, 2026 నవంబరు 10న మంత్రి దామోదర రాజనర్సింహ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా కూడా 90 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారని క్రిశాంక్ పేర్కొన్నారు. రెండేళ్ల వ్యవధిలోనూ అదే స్థాయి పనుల పురోగతిని చెబుతున్నారని, వాస్తవంగా ఎంత మేరకు నిర్మాణ పనులు జరిగాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి కార్పొరేట్ ఆసుపత్రులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. టిమ్స్ సనత్‌నగర్ ఆసుపత్రిని ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం వాయిదా పడిందని, ఇప్పుడు టిమ్స్ అల్వాల్ విషయంలోనూ జాప్యం జరుగుతోందని ఆరోపించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణాలను వేగవంతం చేసి, అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలతో వాటిని తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, నాయకురాలు నివేదిత, మాజీ కంటోన్మెంట్ బోర్డు సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, ఇతర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కు నివాళి

ముద్ర, పెద్దపల్లి: భారత విద్యా రంగానికి బలమైన పునాది వేసిన గొప్ప నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1888 నవం బర్ 11న సౌదీ అరేబియాలోని మక్కాలో జన్మించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు "మొహియుద్దీన్ అహ్మద్" అని, 'అబుల్ కలాం' అనేది ఆయన బిరుదు కాగా 'ఆజాద్' అనేది ఆయన కలం పేరు అని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడైన ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి, అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పెర్షియన్, బెంగాలీ వంటి అనేక భాషలలో ప్రావీణ్యుడని పేర్కొన్నారు. స్వతంత్ర భారత ప్రభుత్వంలో తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు పనిచేసిన ఆయన నిరుపమాన సేవలను స్మరించుకుంటూ భారత ప్రభుత్వం 2008లో ఆయన జన్మదినమైన నవంబర్ 11ను "జాతీయ విద్యా దినోత్సవం"గా ప్రకటించిందని తెలిపారు. ఐఐటీ, యుజిసి, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ వంటి అనేక ప్రముఖ విద్యా, సాంస్కృతిక సంస్థల స్థాపనలో ఆయన కీలక దిశా నిర్దేశం చేశారని అన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్య అందాలని, ముఖ్యంగా మహిళా అక్షరాస్యత సాంకేతిక విద్యను ప్రోత్సహించాలని ఆజాద్ గారు బలంగా ఆకాంక్షించారని తెలిపారు. ప్రతి సంవత్సరం పాఠశాలలు, కళాశాలలు మరియు విద్యాసంస్థల్లో జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీల సంక్షేమ దినోత్సవం, సందర్భం గా సెమినార్లు, వ్యాస రచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆయన ఆశయా లను స్మరించుకోవాలని సూచించారు. జిల్లా మైనారిటీ అధికారి జి. రవికుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



భూపాల్‌పల్లిలో..

ముద్ర, జయశంకర్‌భూపాల్‌పల్లి: విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.బుధవారం స్వతంత్ర భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మైనారిటీ నాయకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. మైనారిటీల సంక్షేమం, విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు స్వతంత్ర భారతదేశ విద్యా వ్యవస్థ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన



సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్యను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావడం, జాతీయ సమగ్రత, మతసామరస్యం, సమానత్వం, సామాజిక అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే వ్యక్తిగత వికాసంతో పాటు సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. జిల్లాలో మైనారిటీల సంక్షేమం, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు ఆజాద్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదల, నిబద్ధతతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డా కుమారస్వామి, యువజన సర్వీసులు క్రీడల శాఖ అధికారి రఘు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, మొహమ్మద్ మిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, జామా మస్జిద్ అధ్యక్షులు మొహమ్మద్ హబీబ్, మైనార్టీ జిల్లా నాయకులు మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు రాజ్ మహమ్మద్, మైనార్టీ నాయకులు వలీ పాషా, అక్కని, నజీమ్, యాకుబ్, సాజిద్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555